


సమాజ హితం - మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 212 పేజీలు : 12, వెల రూ. 5/- గురువారం, సెప్టెంబరు 24, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

## రూబియోతో జైశంకర్ భేటీ

**రష్యా ఆంక్షల చట్టంపై భారత్ ఆందోళన**

**‘ఎక్స్’లో జైశంకర్ పోస్ట్**

న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భేటీ అయ్యారు. గల్ఫ్ ప్రాంత పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా ఇరువురు నేతలు చర్చించారు.



2లో

## H-1బీ ఫ్రాడ్‌పై అమెరికా దర్యాప్తు ముమ్మరం..

**H-1 వీసాల్లో 20 బిలియన్ డాలర్ల భారీ మోసం జరిగిందన్న అమెరికా**

**తమ దర్యాప్తులో ఈ విషయం వెల్లడైందని, అరెస్టులు తప్పవని హెచ్చరిక**

**కాగ్నిజెంట్, క్లౌడెరా వంటి కంపెనీల PERM ఫైలింగ్‌లపై ఇప్పటికే సస్పెన్షన్**

**H-1 నిబంధనలను కఠినతరం చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్**

**అమెరికా చర్యలతో భారతీయ టెక్కీలు, ఐటీ కంపెనీల్లో తీవ్ర ఆందోళన**

అమెరికాలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఎ-1దీ వీసాల వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎ-1దీ సహా ఇతర ఫారిన్-లేబర్ ప్రోగ్రామ్‌లలో ఏకంగా 20 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.8 లక్షల



## యాదాద్రి ప్లాంట్‌పై సీఎం ఫోకస్..

# దసరాకల్లా ఫుల్ పవర్

**యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై సీఎం, డిప్యూటీ సీఎం సమీక్ష**

**బొగ్గు సరఫరా సమస్యపై అధికారులతో సుదీర్ఘ చర్చ**

**నైనీ గనుల నుంచి బొగ్గు సరఫరా పెంపుపై చర్యలు**

**దసరాకల్లా పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తికి ఆదేశాలు**



డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్ఆర్డీ)లో విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరగకపోవడంపై సమీక్షించిన సీఎం, డిప్యూటీ సీఎంలు అధికారులను తీవ్రంగా ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు, బొగ్గు లభ్యత , ప్లాంట్ నిర్మాణంలోని లోపాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి జరగాలంటే జీ-9 కేటగిరీకి చెందిన బొగ్గు అత్యంత ఆవశ్యకమని అధికారులు సీఎం, డిప్యూటీ సీఎంలకు వివరించారు.

- మిగతా 2వ పేజీలో

## తెలంగాణలో నేడు, రేపు కుండపోత..

# పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్

**5 జిల్లాలకు రెడ్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**

**నిన్న పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు**

**పిడుగుపాటుకు వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళల మృతి**

**భద్రాద్రి జిల్లాలో పాఠశాలలకు రెండు రోజులు సెలవులు**

తెలంగాణలో నేడు, రేపు (గురు, శుక్రవారాలు) అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ 5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడతాయని అంచనా వేస్తూ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. బుధవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో రోజంతా ముసురు పట్టింది. ఖమ్మం జిల్లా కల్లూరులో అత్యధికంగా 6.28 సెం.మీ వర్షపాతం నమోదైంది. రెడ్ అలర్ట్ జారీ చేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజులు సెలవులు ప్రకటించారు. ఇదే జిల్లా బూర్గంపాడు మండలంలో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. పలు ఇళ్ల పైకప్పులు, హోర్డింగులు ఎగిరిపడ్డాయి. ఈ వర్షాల కారణంగా



విషాదకర ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడి ముగ్గురు మహిళా కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరులో లక్ష్మి (35), జడ్చర్లలో యాదమ్మ (66), పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో అంజమ్మ (55) మృతి చెందారు. పిడుగుపాటు వల్ల మరికొందరు గాయపడగా, పశువులు కూడా మృత్యువాత పడ్డాయి.

## అవినీతి ఏ స్థాయికి వెళ్లిందో చెప్పడానికి డీఎస్సీనే ఉదాహరణ!

- గవర్నర్ ను కలిసి వినతిపత్రం అందించిన జగన్
- కూటమి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్న జగన్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- శాప్ కార్యాలయం వద్ద దాడి చేసి, బాధితులపైనే కేసులు పెట్టారని ఆరోపణ
- నకిలీ సర్టిఫికెట్లు, జీవోలతో నియామకాలు జరిపి తర్వాత రద్దు చేశారని వెల్లడి
- న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసిన జగన్



డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో

- మిగతా 2వ పేజీలో



## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు.

**ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం**

**రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి**

**మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్**

**తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు**

**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర**

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారాసుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు

- మిగతా 2వ పేజీలో

## రాష్ట్రవ్యాప్తంగా 963 పాఠశాలల్లో హార్ట్‌ఫుల్ యోగా శిక్షణకు చర్యలు

- టెన్త్, ఇంటర్‌లో 90% ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి
- పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ఉద్యోగ మేళాల నిర్వహణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి

2లో

## ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ‘కాంగ్-నినో’ కారణమన్న కేటీఆర్
- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



2లో



2లో

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

- ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత
- ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

# సినిమా మన జీవనశైలిలో భాగం అవుతున్నదా!

### (24 సెప్టెంబర్ “ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం” సందర్భంగా)



“హాలీవుడ్” పేరుకు ప్రేరణగా బొంబాయి కేంద్రంగా అంతర్జాత స్థాయి చలనచిత్రాలను నిర్మిస్తున్న హిందీ సినీ పరిశ్రమను “బాలీవుడ్” అని పిలుస్తున్నాం. 1970ల్లో ప్రారంభంపైన బాలీవుడ్ సినీ వైభవం నేడు హాలీవుడ్ దృష్టిని కూడా ఆకర్షించడం, అత్యుత్తమ సినిమాలను తీస్తూ ప్రపంచ సినీ ప్రేక్షకుల మనసులు దోయడం జరుగుతోంది. హిందీ భాష సినిమాల ద్వారా భారతీయ నృత్యాలు, సాంస్కృతిక వారసత్వ సంపద, కళలు, గీతాలు, సంగీత మాధుర్యాలను భారతీయ ప్రేక్షకులకు కాకుండా ప్రపంచ దేశాల ప్రజల మన్ననలు సహితం పొందడం మన బాలీవుడ్ విజయంగా భావించాలి. తెలుగు సినీ పరిశ్రమను “టాలీవుడ్” అని, కేరళ మలయాళ సినీ పరిశ్రమను “మాలీవుడ్” అని, కన్నడ సినీ పరిశ్రమను “సాండల్‌వుడ్” అని, పంజాబీ సినీ పరిశ్రమను “పాలీవుడ్” అని, గుజరాతీ సినీ పరిశ్రమను “డాలీవుడ్” అని, బెంగాలీ/మరాటీ/ఒడియా సినీ పరిశ్రమను “ఓలీవుడ్” అని, అస్సామీ సినీ పరిశ్రమను “జాలీవుడ్” అని, భోజ్‌పురీ సినీ పరిశ్రమను “భోజ్‌వుడ్” అని, తమిళ సినీ పరిశ్రమను “కొలీవుడ్” (చెన్నై, కొడంబాకమ్ పేరుతో) అని, లాహోర్ కేంద్రంగా పాకిస్థానీ సినీ పరిశ్రమను “లాలీవుడ్” అని పిలవడం పరిపాటి అయ్యింది.

**ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం :**

భారత “జాతీయ సినీ అవార్డుల ప్రదానం”, “అంతర్జాతీయ ఫిలిమ్ ఫెస్టివల్” నిర్వహణ, “ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా” ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాల నిర్వహణతో బాలీవుడ్ సినీ పరిశ్రమ ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కావడం చూస్తున్నాం. మన హిందీ సినిమాలు ప్రపంచ దేశాల్లో కూడా మంచి ఆదరణ పొందడం నేడు సర్వసాధారణం అయ్యింది. బాలీవుడ్ సినిమా ద్వారా మనసులను రంజింపజేసే సుస్వర సంగీతం, ఆకర్షణీయ క్లాసికల్/నాన్– క్లాసికల్ డ్యాన్సులు, మన ఆచార వ్యవహారాలు, భారతీయ జీవనశైలి, మానవీయ విలువలు, చారిత్రక/పౌరాణిక చరిత్రలు, మరిచి పోలేని పాత్రలు ఎన్నో మన బాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడం జరిగింది. 24 సెప్టెంబర్ 1913 రోజున దాదాసాహెబ్ పాల్కే నిర్మించిన భారత తొలి పూర్తి నిడివి కలిగిన “రాజా హరిశ్చంద్ర” సినిమా విడుదల కావడంతో ఆ అపూర్వ ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏట 24 సెప్టెంబర్ రోజున “ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం (వరల్డ్ బాలీవుడ్ డే)” పాటించడం 2014 నుంచి ప్రారంభం అయ్యింది. భారతీయ తొలి కలర్ సినిమా “కిషన్ కన్నయ్య” 1937లో విడుదల కావడం ఒక ప్రధాన అంశంగా తీసుకోవాలి. సామాజిక అంశాలతో కూడిన ఫామిలీ డ్రామాల కేంద్రంగా 1940ల్లో భారతీయ సినిమా స్వర్ణ యుగం ప్రారంభం అయ్యింది. ప్రపంచ సినీ ప్రభావంతో భారతీయ బాలీవుడ్ సినిమా కొత్త పుంతలు తొక్కుతూ, టెక్నాలజీని ఒంటపట్టించుకొని అద్భుతాలు తెరపై చూపిస్తూ బాలీవుడ్ సినీ పరిశ్రమ ఉజ్వలంగా ముందుకు సాగుతోంది. 1990ల తర్వాత పూర్వపు సినీ పరిశ్రమ నూతన రంగురంగుల కాస్ట్యూమ్స్, అద్భుత సంగీత సరాగాలు, ఉద్విగ్నభరిత కథ గమనాలతో “న్యూ బాలీవుడ” రంగులు పూసుకొని దేశ సరిహద్దులను చెరిపివేస్తూ ప్రపంచ మానవాళి ఇంటిలో, వారి మనసుల్లో తిష్ట వేస్తున్నది.

**ప్రపంచ బాక్స్ ఆఫీస్‌లను బద్దలు కొడుతున్న బాలీవుడ్ సినిమా:**

నాటి బాలీవుడ్ సినిమాలు షోలే, దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, ముగల్–ఈ– ఆజామ్, త్రీ–ఈడియట్స్ లాంటి సినిమాలు ప్రపంచ బాక్స్ ఆఫీస్‌లను సహితం బద్దలు కొట్టడం జరిగిపోయింది. బాలీవుడ్ సినిమాల్లో అత్యంత పొడవైన సినిమాగా “ఎల్‌ఓసి కార్గిల్” సినిమా (గంటలు 4.15 నిమిషాలు) నిలిచింది. నేడు ప్రతి ఏట బాలీవుడ్ పరిశ్రమ నుంచి దాదాపు 1,000 సినిమాలు నిర్మితం అవుతున్నాయి. అన్ని భాషల్లో కలిపి భారతీయ సినీ పరిశ్రమ ద్వారా ఏడాదికి 3,000 సినిమాలు విడుదలై దాదాపు 10,000 సినీ థియేటర్లలో ప్రదర్శిస్తాం అవుతున్నాయి. ప్రపంచ బాలీవుడ్ దినోత్సవ వేదికగా మన సినీ పరిశ్రమ కీర్తిని చర్చించుకోవడం, పైరసీ సమస్యను కట్టడి చేయడం, మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా సినిమాలు తీయడం, డిజిటల్ యుగపు యువత దృష్టిని ఆకట్టుకోవడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరగాలి. వాణిజ్యపరమైన సినిమాలతో పాటు మన పునాదుల ఆధారంగా సంస్కృతి వారసత్వాలు ఉట్టిపడే విధంగా సినిమాలు తీయడం సమాంతరంగా కొనసాగాలి.

సినిమా ఒక వినోదం మాత్రమే కాదని, ఆ పరిశ్రమ ద్వారా మన కళలను కాపాడుకోవడం, సంస్కృతులను రేపటి తరానికి పరిచయం చేయడం, ఆ కథల నుంచి స్ఫూర్తిని పొందడం జరగాలి. నేడు ఓటిటి వేదికలు రావడం, గ్రాఫిక్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఒక అతి పెద్ద ప్రజాదరణ పొందిన పరిశ్రమగా కొనసాగుతున్నది. భిన్న భాషల భారతంలో అనేక సినిమాలు విడుదల అవుతూ మనకు తెలియకుండానే మన సామాజిక జీవన విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. నేటి సినిమాలు మన సంస్కృతికి అద్దం పడుతూ, కళలను పోషిస్తూ, కథలతో కట్టిపడేస్తూ, పరిమిత స్థాయిలో పాశ్చాత్య రంగులను పులుముకుంటూ ముందుకు సాగాలని కోరుకుందాం.



**- లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

**9949700037**

---

## పౌరసత్వం కోసం అమెరికాలో ప్రసవం..

# ఇకపై కఠిన నిబంధనలు!

### నిర్వాహకులు, మధ్యవర్తులపై చర్యలు
### సహకరించే వైద్య సంస్థలపైనా వేటు
### వీసా మోసాలపై కొత్త ఫిర్యాదు పోర్టల్
### నకిలీ ఉద్యోగాలు, పెళ్లిళ్లపై ఫిర్యాదు చేసే అవకాశం
### మోసం తేలితే వీసా రద్దు చేసే అవకాశం




అమెరికాలో బిడ్డను కని.. ఆ బిడ్డకు అక్కడి పౌరసత్వం ఇప్పించాలనుకునే వారికి ఇక కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి ‘బర్త్ టూరిజం’ను అడ్డుకునేందుకు అమెరికా కొత్త వీసా ఆంక్షలు ప్రకటించింది. ఈ వ్యవహారాన్ని వ్యాపారంగా మార్చుకున్న సంస్థలపైనా కఠిన చర్యలు తీసుకోనుంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ విషయాన్ని ప్రకటించారు. బర్త్ టూరిజం కోసం విదేశీయులను అమెరికాకు పంపించే సంస్థల యజమానులు, నిర్వాహకులు, మేనేజర్లను లక్ష్యంగా చేసుకోనున్నట్లు తెలిపారు. వీసా దరఖాస్తుల్లో తప్పుడు వివరాలు ఇవ్వాలని చెప్పే మధ్యవర్తులపైనా వేటు తప్పదని స్పష్టం చేశారు. విదేశీయులు అమెరికాలో ప్రసవించేలా తెలిసి సహకరించే వైద్య సేవల సంస్థలపైనా చర్యలు ఉండనున్నాయి. ఈ వ్యవహారంలో మెడికెయిడ్ ప్రయోజనాలను మోసపూరితంగా వాడినా చర్యలు తప్పవని అమెరికా తెలిపింది. కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులకూ ఆంక్షలు వర్తించే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు వీసా మోసాలపై ఫిర్యాదు చేసేందుకు అమెరికా కొత్త ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. నకిలీ పత్రాలు, తప్పుడు ప్రయాణ వివరాలు, బోగస్ పెళ్లిళ్లు, కల్పిత ఉద్యోగ ఆఫర్ల వంటి మోసాలపై ప్రజలు సమాచారం ఇవ్వొచ్చు. బర్త్ టూరిజం వ్యవహారాలనూ ఫిర్యాదు చేయవచ్చు. అందిన సమాచారాన్ని అధికారులు పరిశీలిస్తారు. మోసం చేసినట్లు తేలితే వీసా రద్దు చేయొచ్చు. అవసరమైతే తదుపరి దర్యాప్తు కోసం చట్టబద్ధ సంస్థలకు కేసును అప్పగిస్తారు. అమెరికాలో పుట్టిన వారికి పౌరసత్వం కల్పించే నిబంధనను ఆసరాగా చేసుకొని కొందరు బర్త్ టూరిజం వ్యాపారం చేస్తున్నారు. ప్రయాణం, వసతి, ప్రసవ ఏర్పాట్లను కలిపి ప్రత్యేక ప్యాకేజీలు కూడా అందిస్తున్నారు. ఈ తరహా మోసాలను అడ్డుకోవడమే తాజా చర్యల లక్ష్యమని రూబియో తెలిపారు.

---

## పుతిన్ వలలో చిక్కవద్దు.. మీ పౌరులను కాపాడుకోండి

# భారత్ సహా 47 దేశాలకు జెలెన్‌స్కీ విజ్ఞప్తి

**ఉక్రెయిన్‌పై యుద్ధానికి 47 దేశాల పౌరులను రష్యా వాడుకుంటోందని ఆరోపణ**

**ఈ జాబితాలో భారత్ పేరును కూడా ప్రస్తావించిన జెలెన్‌స్కీ**

**మోసపూరితంగా రప్పించి బలవంతంగా సైన్యంలో చేర్చుతున్నారని వెల్లడి**

**తమ పౌరులను రక్షించుకోవాలని ఆయా దేశాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడి పిలుపు**

**ఉత్తర కొరియాతో రష్యా సైనిక సహకారంపై ఆందోళన వ్యక్తం చేసిన జెలెన్‌స్కీ**



ఉక్రెయిన్‌పై సాగిస్తున్న యుద్ధంలో రష్యా విదేశీ పౌరులను కూడా వాడుకుంటోందని, ఈ జాబితాలో భారతీయులు కూడా ఉన్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో (యూఎన్‌జీఏ) ఆయన ప్రసంగిస్తూ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రష్యా తమ సైన్యంలోకి భారత్ సహా మొత్తం 47 దేశాల పౌరులను నియమించుకుని, వారిని యుద్ధ రంగంలోకి దించుతోందని ఆరోపించారు. ఈ జాబితాలో ఘనా, నేపాల్, తజికిస్థాన్, భారత్, యెమెన్, కెన్యా, జింబాబ్వే, క్యూబా, బెలారస్, సుడాన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల పేర్లను జెలెన్‌స్కీ ప్రస్తావించారు. మోసపూరిత మార్గాల్లో, జిమ్మిక్కులు చేసి ఈ దేశాల పౌరులను రష్యా తమ దేశానికి రప్పించుకుంటోందని, ఆ తర్వాత వారిని బలవంతంగా సైనిక సేవలోకి దించుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా చేస్తున్న ఈ చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయా దేశాలకు పిలుపునిచ్చారు. “ఈ 47 దేశాల ప్రతినిధులతో నేను నేరుగా మాట్లాడాలనుకుంటున్నాను. రష్యా మీ ప్రజలతో ఏం చేస్తోందో మీకు తెలుసు. వారు మీ పౌరులు. వారిని జాగ్రత్తగా చూసుకోండి. వారిని మరో యుద్ధ క్షేత్రంలోకి నెట్టవద్దు. ఈ యుద్ధంలోకి పుతిన్ మిమ్మల్ని లాగకుండా చూసుకోండి” అని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో ఉత్తర కొరియాతో రష్యా సైనిక సహకారంపైనా జెలెన్‌స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉక్రెయిన్ సైన్యం ఇద్దరు ఉత్తర కొరియా సైనికులను యుద్ధ ఖైదీలుగా పట్టుకుందని, వారిని దక్షిణ కొరియాకు అప్పగించామని తెలిపారు. మరోవైపు, ఉక్రెయిన్ తన రక్షణ భాగస్వామ్యాలను విస్తరించుకుంటోందని, ఇందులో భాగంగా ఫిన్‌లాండ్‌తో డ్రోన్‌ల ఒప్పందం, ఆస్ట్రేలియాతో భద్రతా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. యుద్ధాన్ని కొనసాగించే రష్యా సామర్థ్యాన్ని పరిమితం చేసేందుకు అంతర్జాతీయ సమాజం మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన తన ప్రసంగం ద్వారా కోరారు.

---

# సంపాదకీయం

## వాన వస్తేనే ఎందుకీ వణుకు?

హైదరాబాద్‌కు వర్షం కొత్త కాదు. వానాకాలం వస్తే నగరంపై మబ్బులు కమ్ముకోవడం, ఒక్కసారిగా భారీ వర్షం కురవడం, చెరువులు నిండడం, రహదారులు తడవడం సహజమే. కానీ గత కొన్నేళ్లుగా నగరంలో వర్షం ఒక సహజ ఋతు పరిణామంగా కాకుండా ఒక అత్యవసర పరిస్థితిగా మారుతున్నది. కొద్దిసేపు భారీ వర్షం పడితే చాలు.. ప్రధాన రహదారులు చెరువులను తలపించడం, లోతట్టు ప్రాంతాలు మునగడం, వాహనాలు నీటిలో చిక్కుకోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం, ట్రాఫిక్ కిలోమీటర్ల మేర నిలిచిపోవడం, ఇళ్లలోకి నీరు చేరడం వంటి సమస్యలు పునరావృతమవుతున్నాయి. వాన పడటం సమస్య కాదు. వానను తట్టుకునే నగర సామర్థ్యం తగ్గిపోవడమే అసలు సమస్య. హైదరాబాద్ విస్తరించింది. జనాభా పెరిగింది. భవనాలు పెరిగాయి. రహదారులు పెరిగాయి. వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, పరిశ్రమలు, కొత్త కాలనీలు నగర భౌగోళిక స్వరూపాన్నే మార్చేశాయి. ఒకప్పుడు వర్షపు నీరు సహజంగా ప్రవహించిన దారులు ఇప్పుడు నిర్మాణాలతో నిండిపోయాయి. నీరు నేలలోకి ఇంకే ఖాళీలు తగ్గిపోయాయి. చెరువులు, కుంటలు, నాలాలు, సహజ ప్రవాహ మార్గాలు క్రమంగా కుదించుకుపోయాయి. ఫలితంగా ఆకాశం నుంచి పడిన నీటికి నేలపై చోటు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఆ నీరు చివరకు రహదారులపైకి వస్తోంది. రహదారులు ముంపు ప్రాంతాలుగా మారుతున్నాయి. ప్రజల జీవనం స్తంభిస్తోంది.

నగర వర్షాల సమస్యను కేవలం డ్రైనేజీ సమస్యగా చూడటం సరిపోదు. ఇది నగర ప్రణాళికకు సంబంధించిన సమస్య. భూవినియోగ విధానానికి సంబంధించిన సమస్య. చెరువుల పరిరక్షణకు సంబంధించిన సమస్య. నాలాల నిర్వహణకు సంబంధించిన సమస్య. నిర్మాణ అనుమతుల అమలుకు సంబంధించిన సమస్య. పౌరుల ప్రవర్తనకు సంబంధించిన సమస్య. ముఖ్యంగా నగరాన్ని దీర్ఘకాలికంగా ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై మన ఆలోచనలో ఉన్న లోపానికి ఇది అద్దం పడుతోంది.

వర్షం కురిసిన ప్రతిసారీ అధికార యంత్రాంగం అప్రమత్తమవుతుంది. సహాయక బృందాలు రంగంలోకి దిగుతాయి. అత్యవసర నంబర్లు ప్రకటిస్తారు. ముంపు ప్రాంతాలను గుర్తిస్తారు. నీటిని తొలగించే చర్యలు చేపడతారు. ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తారు. ఇవన్నీ అవసరమే. కానీ వర్షం ఆగిన తర్వాత సమస్య కూడా ఆగిపోతుందనే దృక్పథం మాత్రం మారాలి. ప్రతి భారీ వర్షం తర్వాత అదే ప్రాంతం మళ్లీ మునుగుతున్నప్పుడు, సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కారం ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్న ఎదురవుతోంది.

హైదరాబాద్ భౌగోళిక స్వరూపం ప్రత్యేకమైనది. కొండలు, లోయలు, చెరువులు, సహజ నీటి ప్రవాహ మార్గాలతో కూడిన ప్రాంతంగా నగరం అభివృద్ధి చెందింది. ఒకప్పుడు వర్షపు నీరు ఒక చెరువు నుంచి మరో చెరువుకు, అక్కడి నుంచి మరొక జలాశయానికి చేరే విధంగా సహజ వ్యవస్థ ఉండేది. కాలక్రమేణా ఆ వ్యవస్థలో అనేక చోట్ల అంతరాయం ఏర్పడింది. చెరువుల మధ్య ఉన్న అనుసంధాన మార్గాలు ఆక్రమణలకు గురయ్యాయి. నాలాలు కుంచించుకుపోయాయి. వాటి మీద నిర్మాణాలు వచ్చాయి. సహజ ప్రవాహ మార్గాలపై రహదారులు, భవనాలు ఏర్పడ్డాయి. వర్షపు నీరు వెళ్లాల్సిన దారి మూసుకుపోయినప్పుడు వరదలు రావడం ఆశ్చర్యకరం కాదు.

నగరంలో వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లిపోవాలనే ఆలోచనతోనే పరిష్కారం వెతకడం కూడా ఒక పరిమిత దృక్పథమే. ప్రతి చుక్క నీటిని నగరం నుంచి బయటకు పంపడం మాత్రమే లక్ష్యం కాకూడదు. కొంత నీటిని నగరంలోనే నిల్వ చేయాలి. భూగర్భ జలాలను పెంచాలి. చెరువులను రక్షించాలి. నీరు నేలలోకి ఇంకే ప్రాంతాలను కాపాడాలి. వర్షపు నీటి ప్రవాహాన్ని సహజ మార్గాల్లోకి మళ్లించాలి. నగరం నీటిని శత్రువుగా కాకుండా వనరుగా చూడాల్సిన సమయం వచ్చింది.

హైదరాబాద్‌లో ప్రతి భారీ వర్షం ఒక హెచ్చరిక. ఒక ప్రాంతంలో నీరు నిలిచిందంటే అక్కడ డ్రైనేజీ సామర్థ్యం సరిపోవడం లేదనే అర్థం. ఒక వంతెన కింద నీరు నిలిచిందంటే అక్కడ నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనే అర్థం. ఒక నాలా పదేపదే పొంగిపొర్లుతుంటే దాని వెడల్పు, లోతు, ప్రవాహ సామర్థ్యం, ఆక్రమణలు, అనుసంధాన ప్రాంతాలన్నింటినీ పరిశీలించాల్సి ఉంటుంది. ఒక కాలనీలో ప్రతి వానకూ ఇళ్లలోకి నీరు వస్తుంటే అక్కడ నిర్మాణ అనుమతులు, భూభాగ స్వభావం, సహజ నీటి ప్రవాహం వంటి అంశాలను తిరిగి పరిశీలించాలి.

అయితే మనం సాధారణంగా ఏం చేస్తున్నాం? నీరు నిలిచిన తర్వాత మోటార్లు పెడుతున్నాం. ట్రాఫిక్ నిలిచిన తర్వాత రహదారులను క్లియర్ చేస్తున్నాం. చెట్లు పడిపోయిన తర్వాత వాటిని తొలగిస్తున్నాం. నాలాలు పొంగిన తర్వాత పూడిక తీస్తున్నాం. ఇవన్నీ తక్షణ చర్యలు. కానీ వర్షం ఎందుకు అదే ప్రాంతాన్ని పదేపదే ముంచుతోంది అన్న మూల కారణాన్ని ప్రశ్నించడం తక్కువగా కనిపిస్తోంది. నగర పరిపాలనకు తక్షణ స్పందన ఎంత అవసరమో, దీర్ఘకాలిక ప్రణాళిక అంతకంటే అవసరం.

నగరంలోని రహదారులు కూడా వర్షపు నీటి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయి. భారీగా కాంక్రీట్ వేయడం వల్ల నీరు నేలలోకి ఇంకే అవకాశం తగ్గుతుంది. రహదారుల పక్కన సరైన వర్షపు నీటి కాలువలు లేకపోతే నీరు రహదారిపైనే ప్రవహిస్తుంది. కాలువలు ఉన్నా అవి చెత్తతో నిండిపోతే ప్రవాహ సామర్థ్యం తగ్గుతుంది. ప్లాస్టిక్ సంచులు, సీసాలు, నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్త నాలాల్లోకి చేరితే చిన్న వర్షానికే నీరు వెనక్కి చేరే పరిస్థితి వస్తుంది. కాబట్టి వరదల సమస్యకు కేవలం పెద్ద ప్రాజెక్టులు మాత్రమే పరిష్కారం కాదు. చిన్న స్థాయి నిర్వహణ కూడా అంతే ముఖ్యం.

ఇక్కడ పౌరుల బాధ్యతను కూడా విస్మరించలేం. రహదారులపై చెత్త వేయడం, నాలాల్లో వ్యర్థాలు పడేయడం, నిర్మాణ సామగ్రిని నీటి ప్రవాహ మార్గాల్లో ఉంచడం వంటి చర్యలు చివరకు నగరానికే నష్టం చేస్తాయి. వర్షం వచ్చినప్పుడు డ్రైనేజీ మూసుకుపోయిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు, ఆ డ్రైనేజీలోకి చేరిన చెత్త ఎక్కడి నుంచి వచ్చిందో కూడా ఆలోచించాలి. నగరం అనేది ప్రభుత్వం ఒక్కటే నిర్వహించే వ్యవస్థ కాదు. ప్రజలు, స్థానిక సంస్థలు, నిర్మాణ సంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రతి పౌరుడు దాని భాగస్వామే.

అయితే పౌర బాధ్యతను ముందుకు తెచ్చి ప్రభుత్వ బాధ్యతను తగ్గించలేం. నగరంలోని ప్రధాన మౌలిక వసతులు సమగ్ర ప్రణాళికతో ఉండాలి. ఎక్కడ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి? ఎక్కడ ఇవ్వకూడదు? ఏ ప్రాంతం వరద ముప్పుకు గురయ్యే అవకాశం ఉంది? ఏ చెరువుకు ఎంత నీటి నిల్వ సామర్థ్యం ఉంది? ఏ నాలా ఎంత ప్రవాహాన్ని మోయగలదు? వందేళ్ల వర్షపాతం నమూనాల్లో మార్పులు ఎలా ఉన్నాయి? వాతావరణ మార్పు ప్రభావం ఎంత? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాల ఆధారంగా నగర ప్రణాళిక ఉండాలి.

వర్షపాతం స్వభావం కూడా మారుతున్నది. తక్కువ వ్యవధిలో భారీగా వర్షం కురిసే ఘటనలు నగర మౌలిక వసతులకు పెద్ద సవాలుగా మారుతున్నాయి. గతంలో ఒక రోజంతా కురిసిన వర్షం ఇప్పుడు కొద్ది గంటల్లోనే పడే పరిస్థితులు ఏర్పడితే, పాత లెక్కల ఆధారంగా నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థలు ఒత్తిడికి గురవుతాయి. అందుకే వాతావరణ మార్పుల నేపథ్యంలో నగర మౌలిక వసతులను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షం గతంలో ఎలా ఉండేదో కాకుండా, భవిష్యత్తులో ఎలా ఉండవచ్చో అంచనా వేసి ప్రణాళికలు రూపొందించాలి. హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ అత్యంత కీలకమైన అంశం. చెరువు అంటే కేవలం నీరు నిలిచే ప్రదేశం కాదు. అది నగరానికి సహజ రక్షణ వ్యవస్థ. భారీ వర్షం వచ్చినప్పుడు అదనపు నీటిని స్వీకరించే సామర్థ్యం చెరువులకు ఉంటుంది. చెరువులు క్రమంగా కనుమరుగైతే ఆ నీరు ఎక్కడికి వెళుతుంది? చివరకు కాలనీల్లోకి, రహదారులపైకి, ఇళ్లలోకి వస్తుంది. అందుకే చెరువుల పరిరక్షణను పర్యావరణ అంశంగా మాత్రమే కాకుండా నగర భద్రతా అంశంగా చూడాలి.

చెరువుల చుట్టూ నిర్మాణాలు పెరగడం, వాటి పరిధులు తగ్గడం, మురుగునీరు చేరడం, పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు వాటి సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. చెరువు విస్తీర్ణం కాగితంపై ఉన్నంత మాత్రాన ప్రయోజనం లేదు. వర్షపు నీరు దానికి చేరే మార్గం సజావుగా ఉండాలి. చెరువులో నిల్వ సామర్థ్యం ఉండాలి. అదనపు నీరు వెళ్లే మార్గం ఉండాలి. ఈ మొత్తం వ్యవస్థను ఒక యూనిట్‌గా పరిగణించి నిర్వహించాలి.



**-గుర్రం పాపిరెడ్డి**
**-ఎడిటర్**

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
గురువారం, సెప్టెంబరు 24, 2026

# వెంకట్‌రెడ్డి బాపు విగ్రహ ఏర్పాటుకు మోక్షం ఎప్పుడు?

## గ్రామ పంచాయతీ తీర్మానాలు బుట్టదాఖలయ్యాయా?.. ఏళ్లుగా ఎదురుచూపులు

## ఎల్లారెడ్డిపేట తొలి తరం నాయకుడి సేవలను నేటి నేతలు మరిచిపోయారా?

## మండల సాధనలో కీలక పాత్ర పోషించిన బాపు విగ్రహానికి ఎందుకింత జాప్యం?





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి, సెప్టెంబర్ 23: ఎల్లారెడ్డిపేట రాజకీయ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నిస్వార్థ రాజకీయ నాయకుడు దివంగత వెంకట్‌రెడ్డి బాపు విగ్రహ ఏర్పాటుకు మోక్షం ఎప్పుడు లభిస్తుందనే ప్రశ్న ప్రస్తుతం మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రామ ప్రజలు ప్రేమగా, గౌరవంగా 'బాపు' అని పిలుచుకునే ఆ మహానేత జ్ఞాపకార్థం శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ స్థాయిలో గతంలో తీసుకున్న నిర్ణయాలు ఏమయ్యాయనే సందేహాలను పలువురు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట తొలి తరం రాజకీయ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన వెంకట్‌రెడ్డి బాపు.. నాటి సిరిసిల్ల సమితి ప్రెసిడెంట్‌గా, ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీపీగా, మాజీ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఆయన రాజకీయ ప్రస్థానం కేవలం పదవులకే పరిమితం కాలేదని, గ్రామం--మండల అభివృద్ధి కోసం వ్యక్తిగతంగా ఎన్నో త్యాగాలు చేశారని ఆయనను దగ్గరగా చూసిన వారు గుర్తుచేసుకుంటున్నారు.

### మండల సాధనలో కీలక పాత్ర

ఎల్లారెడ్డిపేట మండలంగా ఏర్పడటంలో బాపు కీలక పాత్ర పోషించారని స్థానికులు చెబుతున్నారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎల్లారెడ్డిపేటను మండలంగా ఏర్పాటు చేయించేందుకు ఆయన చేసిన కృషిని ఇప్పటికీ పలువురు గుర్తు చేసుకుంటున్నారు. మండల ఏర్పాటు కోసం రాజకీయంగా, ప్రజాపరంగా ఆయన చేసిన ప్రయత్నాలు ఎల్లారెడ్డిపేట చరిత్రలో నిలిచిపోయాయని స్థానికుల అభిప్రాయం.

### ఎందరికో రాజకీయ ఓనమాలు నేర్పిన నేత

ఎల్లారెడ్డిపేటకు చెందిన పలువురు నేటి రాజకీయ నాయకులకు వెంకట్‌రెడ్డి బాపు రాజకీయ గురువుగా నిలిచారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. అప్పట్లో రాజకీయాల్లోకి వచ్చిన అనేక మందిని ప్రోత్సహించి, వారికి రాజకీయ ఓనమాలు నేర్పి, ప్రజా జీవితంలో ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని చెబుతున్నారు. తన రాజకీయ ప్రస్థానంలో సంపాదించిన ఆస్తులను సైతం ప్రజా అవసరాలకు, మండల అభివృద్ధికి వినియోగించిన సందర్భాలు ఉన్నాయని ఆయనను ఎరిగినవారు గుర్తుచేస్తున్నారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా బాపుకు అప్పటి తరం ప్రజల్లో ప్రత్యేక గౌరవం ఉండేదని అంటున్నారు.

### చివరి రోజుల్లోనూ అదే నిస్వార్థ జీవితం

ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన బాపు చివరి రోజుల్లో మాత్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు తన చుట్టూ రాజకీయంగా ఎంతోమందిని తీర్చిదిద్దిన నాయకుడు జీవిత చరమాంకంలో కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రావడం ఆయన నిస్వార్థ రాజకీయ జీవితానికి మరో కోణంగా వారు గుర్తుచేస్తున్నారు.

### తయారైన శిలా విగ్రహం.. కానీ ఏర్పాటు ఎప్పుడు?

బాపు జ్ఞాపకార్థం ఆయన శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి, అందుకోసం విగ్రహాన్ని కూడా తయారు చేయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే విగ్రహం సిద్ధమై ఉన్నప్పటికీ దానిని ఏర్పాటు చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. గ్రామ పంచాయతీ తీర్మానాలు ఉన్నప్పటికీ వాటి అమలు ఎందుకు ముందుకు సాగడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడి విగ్రహం ఏర్పాటు విషయంలో కూడా ఇంతకాలం జాప్యం ఎందుకు జరుగుతోందని నిలదీస్తున్నారు.

### బాపు సేవలకు ఇదేనా గౌరవం?

బాపు రాజకీయంగా ఎదిగించిన వారే నేడు వివిధ స్థాయిల్లో ఉన్నారని, అలాంటి నాయకుడి విగ్రహం ఏర్పాటు విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం జరుగుతోందని మండల ప్రజల్లో చర్చ సాగుతోంది. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన నేటి తరం నేతలు ఆయనను మరచిపోతున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే విగ్రహం ఏర్పాటు విషయంలో జాప్యానికి వాస్తవ కారణాలు ఏమిటన్నది సంబంధిత గ్రామ పంచాయతీ, అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. తీర్మానాలు, స్థల ఎంపిక, అనుమతులు తదితర అంశాలపై అధికారిక వివరాలు వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న సందేహాలకు తెరపడే అవకాశం ఉంది.

### ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఎల్లారెడ్డిపేట రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన వెంకట్‌రెడ్డి బాపు సేవలను స్మరించుకోవడం ఆయనకు దక్కే నిజమైన గౌరవమని గ్రామస్థులు అంటున్నారు. ఆయన విగ్రహాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి, భవిష్యత్ తరాలకు ఆయన సేవలు, నిస్వార్థ రాజకీయ జీవితం, మండల సాధన కోసం చేసిన కృషి తెలిసేలా చేయాలని కోరుతున్నారు.

**ప్రజల కోసం పదవులను ఉపయోగించిన నాయకుడి విగ్రహం ప్రజల మధ్యకు రావడానికి ఇంకా ఎంతకాలం?**

**గ్రామ పంచాయతీ తీర్మానాలకు ఎప్పుడు కార్యరూపం?**

**వెంకట్‌రెడ్డి బాపు విగ్రహ ఏర్పాటుకు మోక్షం ఎప్పుడు?**

అనే ప్రశ్నలకు సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

# వినాయకుడి నిమజ్జనానికి వేళాయే!

**జలాశయాల వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్న నేతలు**

**ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించాలి: పోలీసులు.. డీజేలకు అనుమతి లేదు**





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 23: వినాయక చవితి సందర్భంగా మండపాల్లో కొలువుదీరిన గణనాథుడు తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలు అందుకుని నవరాత్రులు పూర్తి చేసుకున్నాడు. దీంతో బుధవారం నుంచి మండలవ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. నిమజ్జనానికి తరలివెళ్లనున్న గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికేందుకు సిద్ధమవుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి ఆయా గ్రామాల నాయకులు, యువజన సంఘాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువుల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. మండల కేంద్రంలోని గిద్ద చెరువు, రాచర్ల బొప్పాపూర్‌లోని జక్కుల చెరువుతో పాటు ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జన సమయంలో విగ్రహాలను సురక్షితంగా నీటిలోకి తరలించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

### డీజేలకు అనుమతి లేదు

వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిమజ్జన ఊరేగింపులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

### భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేయాలి

గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు. ఊరేగింపులో యువత అప్రమత్తంగా ఉండాలని, చెరువుల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సాఫీగా జరిగేలా ప్రజలు, నిర్వాహకులు, నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న లంబోదరుడిని కన్నుల పండువగా ఊరేగింపుగా తీసుకెళ్లి, భక్తి భావంతో నిమజ్జనం చేసేందుకు మండల ప్రజలు సిద్ధమవుతున్నారు.

# శివ పరాశక్తి పీఠంలో ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 23: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శివ పరాశక్తి పీఠంలో వినాయక నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా తొమ్మిది రకాల నైవేద్యాలను గణనాథుడికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ పరాశక్తి పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ ఆధ్వర్యంలో గణనాథుడికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం కుటుంబ సభ్యులు, మహిళా భక్తులు, బంధుమిత్రులు భక్తిశ్రద్ధలతో పాల్గొని వివిధ రకాల నైవేద్యాలను స్వామివారికి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గణనాథుడి ప్రత్యేక పూజలతో పీఠం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## శ్రీ మట్టి గణపయ్య నిమజ్జన మహోత్సవం :: టి పి సి సి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి మరియు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటుతూ ప్రతిష్ఠించిన శ్రీ మట్టి గణపయ్య నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపయ్యకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం డప్పు వాయిద్యాలు, భజనలు, గణపతి నామస్మరణల మధ్య శోభాయాత్రగా నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని "గణపతి బప్పా మోరియా" నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ హితమైన మట్టి గణపతుల ప్రతిష్ఠాపన ప్రతి ఒక్కరూ చేపట్టాలని, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గం సుఖశాంతులు, సుభిక్షాలతో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళలు, యువత, కార్యకర్తలు, భక్తులు మరియు పెద్ద సంఖ్యలో నియోజకవర్గ ప్రజలు పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, బ్లాక్ ఆత్మ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి మదర్, జలగం కుమార్,కమ్మగాని నాగయ్య గౌడ్, పెనుగొండ రమేష్, పన్నీరు వెంకన్న, చిలువేరు కృష్ణమూర్తి, కామారపు సునీల్, ఎండి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



## సుందరయ్య నగర్‌లో వైభవంగా దీపోత్సవం ఎస్ఎన్ఆర్ కే యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి మహోత్సవాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, సారపాక పరిధిలోని సుందరయ్య నగర్‌లో వినాయక నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఎస్ఎన్ఆర్ కే యూత్, సుందరయ్య నగర్ వాసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయకుడి సన్నిధిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. దీపాల వెలుగులతో వినాయక మండపం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విఘ్నాలను తొలగించి శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడిని దర్శించుకునేందుకు సారపాకతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో సుందరయ్య నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. వినాయకుడి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఎస్ఎన్ఆర్ కే యూత్ సభ్యులు, సుందరయ్య నగర్ యువత, కాలనీ వాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



## గిద్ద చెరువు పార్కులో హైమాస్ట్ లైట్ ప్రారంభం

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువు సమీపంలో ఉన్న పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను బుధవారం సీఐ ఓ. వెంకటేష్, ఎస్సై ఎన్. రమేష్ ప్రారంభించారు. పార్కు పరిసర ప్రాంతాల్లో రాత్రివేళ మెరుగైన వెలుతురు అందించడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించే ఉద్దేశంతో హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎలగందుల నరసింహులు, ఉప సర్పంచ్ బంధారపు బాల్ రెడ్డి, ఈఓ కృష్ణ పాల్గొన్నారు. వార్డు సభ్యులు గాండ్ల అంజన్న, అంతర్పుల గోపాల్, కొత్త చెన్నయ్య, అంకుల్ ప్రవీణ్ తదితరులు హాజరయ్యారు. పార్కు పరిసరాల్లో మెరుగైన వెలుగులు అందుబాటులోకి రావడంతో రాత్రివేళల్లో ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# దువ్వూరు సుజాతమ్మ ,మండల ప్రజా పరిషత్ ప్రసిడెంట్ (దొరవారిసత్రం మండలం) గారికి వీడ్కోలు మహాసభ





(దొరవారిసత్రం మండలం, అరుణప్రభ దిన పత్రిక) : దొరవారిసత్రం, సెప్టెంబర్ 23. తిరుపతి జిల్లా, దొరవారిసత్రం మండలం, దొరవారిసత్రం కార్యాలయం ఆవరణలో శ్రీ కె. గోవర్ధన్, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గారి అధ్యక్షతన శ్రీమతి దువ్వూరు సుజాతమ్మ, దొరవారిసత్రం మండల ప్రజా పరిషత్ ప్రసిడెంట్ గారికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం అదకారులు మరియు మండల నాయుకులు,ఘణంగాపూలమాలలతో మరియు సాలవాలతో సత్కరించి వీడ్కోలు మహా సభను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో శ్రీమతి దువ్వూరు సుజాతమ్మ గారు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరముల కాలంలో ఎన్నో వడిదుడుకులు వెదుర్కున్నప్పటికి పరిపాలన సక్రమంగా నిర్వహించగలిగినందుకు చాలా సంతోషిస్తున్నాను. మండలంలో ప్రజా ప్రతినిధులు, మరియు ప్రభుత్వ అధికారులు అందించిన సహకారములతో దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం నందు 22 లక్షల రూపాయలతో సమావేశపు గది, మండల పరిషత్ కార్యాలయం పునర్నిర్మాణము, స్థానిక ఏం. ఎల్.ఏ గారి సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక కోటి అరవై లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణము, మండల గ్రాంట్ నిధులతో నాలుగు కోట్ల పన్నెండు లక్షల రూపాయలతో వివిధ రకాల పనులు చేపట్టి అభివృద్ధి, 15వ ఆర్థిక సంఘ నిధులు 2023–26 సంవత్సరము వరకు ఒక కోటి పదమూడు లక్షలతో చేతి బోర్లు మరియు పైపులైన్ల నిర్మాణము యొక్క వస్తువుల కొనుగోలు, జలజీవం మిషన్ ద్వారా పి. ఏం.జి .వై పథకాలు క్రింద ఆరు కోట్ల ఇరవై ఐదు లక్షల రూపాయలతో త్రాగునీటి పథకాలు ఏర్పాటు చెయ్యడం చాల గర్విస్తున్నానని తెలియజేసినారు. అదేవిదంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు, మరియు ప్రభుత్వ అధికారులు, మండల నాయుకులు అందించిన సహకారము లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు శ్రీ దువ్వూరు గోపాల్ రెడ్డి, వైస్.ఎం.పి .పి. శ్రీ.ఆర్.రాజేంద్ర ప్రసాద్, మండల తహసీల్దార్, శ్రీ కె.గోవర్ధన్, ఎం.పి.డి.ఓ గారు, శ్రీ రమణయ్య, డి.ఈ,పంచాయత్ రాజ్ గారు, శ్రీ హరి రెడ్డి, మార్కిటింగ్ సొసైటీ చైర్మన్, శ్రీ టి.రమేష్,జడ్.పి. టి.సి గారు మరియు గ్రామ సర్పంచులు, ఎం.పి.టి.సి.లు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సదశివాపేట్ మండలంలో కాంగ్రెస్ సేవాదళ్ కమిటీ సమావేశం

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా: సదశివాపేట మండలంలో కాంగ్రెస్ సేవాదళ్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లికరణం సందీప్ సీడీసీ ఛైర్మెన్ గడీల రాంరెడ్డి , బ్లాక్ కాంగ్రెస్ అద్యేక్షులు చాట్ల సిద్దన్న కాంగ్రెస్ మండల అద్యేక్షులు ఒగ్గు శ్రీనివాస్ లి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సేవాదళ్ నియమ నిబంధనలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు మరియు సేవాదళ్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి మండల కార్యవర్గంతో కలిసి కరణం సందీప్ నాయకులకు, కార్యకర్తలకు సమగ్రంగా వివరించారు. సేవాదళ్ అంటే ఏమిటో ప్రజలలోకి తీసుకుపోయి సేవాదల్ ప్రాముఖ్యత ను అలాగే పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలతో పాటు శ్రీమతి నిర్మలా జగ్గారెడ్డి ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాల్లో మనం పూర్తిస్థాయిలో పాల్గొని ప్రజలకు అవసరమైన పథకాలను గురుంచి పార్టీ తరపున వివరించలనీ జిల్లా అధ్యక్షులు శ్రీ సందీప్ వివరించండం జరిగింది. అఖిల భారతీయ సేవాదళ్ అధ్యక్షులు బి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ గారి నాయకత్వంలో సేవాదళ్ ముందుకు వెళు తోందని, జిల్లా అధ్యక్షులు కరణం సందీప్ గారితో కలిసి చేపట్టిన ఈ చర్చల ద్వారా మన మండల, జిల్లా సేవాదళ్ మరింత బలోపేతమైందని నాయకులు తెలిపారు.

పాల్గొన్న ముఖ్య నాయకులు: సీడీసీ ఛైర్మెన్ గడీల రాంరెడ్డి , బ్లాక్ కమిటీ అద్యేక్షులు చాట్ల సిద్దన్న, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కర్ణం సందీప్ , పార్టీ మండల అధ్యక్షులు ఒగ్గు శ్రీనివాస్,



కుమ్మరి నరసింహులు – కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు, ఈ కార్యక్రమంలో మండల సేవాదళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోలుకుందె వెంకట్ రేడ్డి,ఉప అధ్యక్షులు కే భవాని ప్రసాద్, కిందొడ్ల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిలు హరిజన ఆశమ్మా, నాగరాజ్ గౌడ్, ఎష్ట విష్ణు,కార్యదర్శిలు భాను ప్రసాద్, సయ్యద్ మునీర్,గుడ్డల మహేందర్,తలారి ప్రశాంత్, లక్ష్మెన్, మెట్టు పద్మమ్మ,ఎక్సక్యూటివ్ మెంబెర్ ఆనంద్ కుమర్, ఫాజిల్, క్రాంతి కుమర్, మంగలి తులజారామ్ గొల్ల నర్సిములు మరియు సదశివాపేట్ మండల కాంగ్రెస్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు. చివరగా కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా, మండల ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# 800 నామినేషన్లలో డీపీఎస్ మహబూబాబాద్‌కు ఘన గుర్తింపు

## బ్రెయింఫీడ్ ఎడ్యుకేషన్ ఎక్సపోసింగ్ గ్లోబల్ స్కూల్ ఎక్సెలెంస్ అవార్డ్స్ 2026లో మూడు ప్రతిష్ఠాత్మక గౌరవాలు

అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 22 : ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మహబూబాబాద్ , తెలంగాణ విద్యా రంగంలో మరో ప్రతిష్ఠాత్మక ఘనతను సాధించింది. న్యూఢిల్లీలోని యశోభూమి , ద్వారక లో నిర్వహించిన బ్రెయింఫీడ్ ఎడ్యుకేషన్ ఎక్సపోసింగ్ గ్లోబల్ స్కూల్ ఎక్సెలెంస్ అవార్డ్స్ 2026లో దేశవ్యాప్తంగా వచ్చిన 800 నామినేషన్స్ లో డీపీఎస్ మహబూబాబాద్ ఎంపికై మూడు ప్రతిష్ఠాత్మక గౌరవాలను అందుకుంది. రాపిడ్ గ్రోత్ & ఎమర్జింగ్ స్కూల్ అఫ్ ది ఇయర్, లీడర్షిప్ ఎక్సెలెంస్ ఌ విషనరీ స్కూల్ మానెజ్మెంట్, లైఫ్ స్కిల్స్ , వాల్యూస్ ఌ సిటిజన్షిప్ ఎడ్యుకేషన్ ఎక్సెలెంస్ ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ జె . ప్రమోద్ రెడ్డి పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందిస్తూ, ఈ అవార్డు పాఠశాల చేస్తున్న నిరంతర కృషికి గొప్ప గుర్తింపు అని ప్రశంసించారు. డైరెక్టర్ వి . మహేందర్ రెడ్డి అండ్ ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్ న్యూఢిల్లీలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించి, డీపీఎస్ మహబూబాబాద్ విజయాన్ని జాతీయ వేదికపై నిలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ఉన్నత ప్రమాణాలతో ముందుకు సాగుతామని తెలిపారు.



**విద్యార్థులే విజయానికి అసలైన కేంద్రబిందువు**

ఈ గౌరవం ప్రతి డీపీఎస్ మహబూబాబాద్ స్టూడెంట్స్ కు అంకితం. వారి ఉత్సాహం, క్రమశిక్షణ, సృజనాత్మకత, నేర్చుకోవాలనే తపన మరియు ప్రతిభే పాఠశాల విజయానికి నిజమైన బలం.

# బోడుప్పల్ సర్కిల్‌లో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, పారిశుధ్యం, ట్రాఫిక్, హరితహారం, మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష

## పారిశుధ్యం, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత



సెప్టెంబర్ 23, అరుణ ప్రభ : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సదుపాయాలు కల్పించడంతో పాటు గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, హరితహారం, డ్రైనేజీ, లైటింగ్ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేం దుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పర్యటించి సంబంధిత అధికారులకు పలు విషయాలలో సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చెంగిచెర్ల బేబీ పాండ్‌ను సందర్శించి గణేష్ నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టాయిలెట్లను నిరంతరం పరిశుభ్రంగా నిర్వహించడం, తాగునీటి సౌకర్యం కల్పించడం, అవసరమైన టెంట్‌లను ఏర్పాటు చేయడం వంటి ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పారిశు ధ్యం, ప్రజా సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. చెంగిచెర్ల టీ–జంక్షన్‌లోని ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించి, స్థానికులతో మాట్లాడి అక్కడి ట్రాఫిక్ సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు, వాహనదారులకు మరింత సౌకర్యవంతంగా ఫ్రీ లెఫ్ట్ అందుబాటులో ఉండేలా టి జి ఐ ఐ సి మరియు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రహదారి ఇరువైపులా అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులకు సూచిం చారు. స్వచ్ఛ ఆటోల ద్వారా జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణను కమిషనర్ సమీక్షిం చారు. వాస్తవంగా చెత్తను సేకరించిన తర్వాత మాత్రమే స్కానింగ్ ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరిగే లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. చెత్త సేకరణలో ఎలాంటి అంత రాయం లేకుండా ప్రతి వార్డుకు కేటాయించిన సిబ్బంది, వాహనాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు పరిశుభ్రమైన పరిసరాలు కల్పించడమే లక్ష్యంగా పారిశుధ్య కార్యక్రమాలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని గ్రేవ్‌యార్డుల నిర్వహణను కూడా కమిషనర్ పరిశీలించారు. అర్బన్ బయోడైవర్సిటీ (యు బి డి ), మెయింటెనెన్స్ బృందాలతో సమన్వయం చేసుకుని గ్రీనరీ నిర్వహణ, స్వీపింగ్, పరిసరాల పరిశుభ్రత కోసం అవసరమైన అంచనాలను సిద్ధం చేసి, టెండర్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అనంతరం పీర్జాదిగూడ పెద్ద చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. నిమజ్జన సమయంలో అవసరాన్ని బట్టి క్రేన్‌ను ఇతర నిమజ్జన ప్రాంతాలకు తరలించే అంశంపై సంబంధిత పోలీస్ ఏసీపీతో సమన్వయం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల భద్రత, సౌకర్యం, రాకపోకలు, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రతిరోజూ పకడ్బందీగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్యం, ట్రాఫిక్ సౌకర్యం, పచ్చదనం మరియు మౌలిక వసతులు అందేలా అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని నిర్ణీత సమయంలో అమలు చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ, మున్సిపల్ ఇంజినీర్లు ఏఈ రాకేష్, ఏఈ సాయి కిరణ్, ఏసీబీ నాగిరెడ్డి, యుడిపి మేనేజర్ హరితతో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా సౌకర్యాలు, పరిశుభ్రత, సురక్షిత రాకపోకలు, పచ్చదనం మరియు గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సమగ్రంగా పర్యవేక్షిస్తూ బోడుప్పల్ సర్కిల్‌ను మరింత పరిశుభ్రంగా, సురక్షితంగా మరియు ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు.



## రూ.25,116 పాటపాడి లడ్డు కైవసం చేసుకున్న గాదేపాక భాస్కర్-శిరీష దంపతులు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండలకేంద్రంలోని దర్దేపల్లి రోడ్డుకు గల శ్రీ సోమేశ్వర విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అతి పవిత్రమైన మహిమగల మహిమాన్వితమైన నవరాత్రులు వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య పూజలు అందుకున్నటువంటి స్వామివారి చేతిలోని లడ్డు భారీ మొత్తంలో పాలకుర్తి మండల రికార్డు స్థాయిలో రూ.25,116 పాట పాడి కైవసం చేసుకున్న పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాదేపాక భాస్కర్-శిరీష దంపతులు.



## గొర్రెల కాపరిని ప్రభుత్వం ఆదుకోవాలి

### బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు, అడ్వకేట్ పట్నం రమేష్ కురుమ

అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో మన్నెగూడ కాలనీ కి చెందిన గొర్రెల కాపరి కోదూరు జంగయ్య తన మంద వద్ద ఉండ గా రాత్రి కురిసిన ఉరుములు మెరుపుల వర్షానికి పిడుగు పడి తన మంద లోని 3 మేక లు చనిపోవడం చాలా బాధాకరమైన విషయం కేవలం మందను కాచుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన జంగయ్య కు ఆర్థికంగా ఇది తీరని లోటు కావున తక్షణమే ప్రభుత్వం స్పందించి చనిపోయిన జీవాలకు నష్ట పరిహారంగా లక్ష రూ పాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు సంఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో బహు జన్ సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఉపాధ్యక్షులు వద్దిగల్ల బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తుర్కయాంజాల్ డివిజన్ ప్రెసిడెంట్ ఒర్సు శ్రీనివాస్, భద్రయ్య ముదిరాజ్, బొమ్మరాజు వినోద్, బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు లపంగి రాజు, బి. రాజ్ కుమార్, వి ఆర్ ఓ హనుమంతు, వెటర్నరీ అసిస్టెంట్ ఎర్ర గిరీశ్వర్ తదితరులు ఉన్నారు.

## బయ్యారం బీటీపీఎస్ ఎదుట నేడు బీఆర్ఎస్ మహాధర్నా

### బొగ్గు సరఫరా నిలిపివేతను నిరసిస్తూ భారీ ఆందోళన



బూర్గంపాడు: సింగరేణి సంస్థ నుంచి జెన్‌కోకు బొగ్గు సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బయ్యారం బీటీపీఎస్ గేటు ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు అధ్యక్షత వహించనున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మహాధర్నాలో పాల్గొన నున్నారు. ఈ కార్యక్రమానికి బూర్గంపాడు మండలం, పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, బీఆర్టీయూ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, ఉద్యమ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత కోరారు. పార్టీ శ్రేణులు ఉదయం 9 గంటలకే బీటీపీఎస్ గేటు వద్దకు చేరుకుని మహాధర్నాను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## శాంతియుతంగా వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించాలి

### భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకుంటూ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: చుక్కపల్లి బాలాజీ



అరుణ ప్రభ :– సారపాక వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో శ్రీ విఘ్నేశ్వరుడిని పూజించిన ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని శ్రేయోభిలాషి చుక్కపల్లి బాలాజీ ఆకాంక్షించారు. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు. అధిక శబ్దంతో కూడిన డీజేలకు దూరంగా ఉంటూ భక్తిశ్రద్ధలు, క్రమశిక్షణతో వేడుకలు నిర్వహించాలని సూచించారు. నిమజ్జన సమయంలో చిన్నారులు, మహిళలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గణనాథుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సురక్షితంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని సుఖసంతోషాలతో ఇంటికి చేరుకోవాలని చుక్కపల్లి బాలాజీ ఆకాంక్షించారు.

# వీర శైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో శ్రావణమాసం ముగింపు వేడుకలు





అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : శ్రావణమాసం ముగింపు సందర్భంగా సదాశివపేట పట్టణంలో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో స్థానిక బసవేశ్వర మందిరంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సంప్రదాయంలో భాగంగా ఈ సంవత్సరం కూడా ఉమామహేశ్వర వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ అధ్యక్షులు గాంధిగ రాజు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా శ్రావణమాసం సందర్భంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, సాయంత్రం మహిళలు, భక్తుల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివరాజ్ పాటిల్, మాజీ చైర్‌పర్సన్, 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణ శివరాజ్ పాటిల్, కౌన్సిలర్ ఉల్లిగడ్డ ఉమారాణి, శంకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, నాయి కోటి రామప్ప, అనిమిశెట్టి మల్లేశం, ఆకుల శివ, బాబు పాటిల్, కోటగుండప్ప పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు, కోశాధికారి పోలీస్ సంతోష్ పాటిల్, గురు శివరాజ్, దేశెట్టి చంద్రశేఖర్, సీ హెచ్ .సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఉమామహేశ్వర వ్రతంలో సింధిరేకేరి లోకేష్--దంపతులు, దేశెట్టి శేఖర్--దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహక అధ్యక్షులు అన్మిశెట్టి జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి సిద్దికేర్ వినోద్, కోశాధికారి అమరాధి రాచన్న, జిల్లా ఉపాధ్యక్షులు వీర మహేందర్ అడ్వకేట్, సమాజ సభ్యులు రాచప్ప, రమేష్, రవి, సురేష్ , శేఖర్, శేఖర్, సతీష్, రవణప్ప, సిద్ధోలు వినోద్ , షాబాద్ వీరన్న, విశ్వనాథ్,ప్రవీణ్,లోకేష్,మల్లేశం,వీరు,వైద్యనాథ్,నర్సింల,నాగు, మరియు మహిళా సభ్యులు అన్నపూర్ణ, కవిత, అన్నపూర్ణ,శశికళ, శిరీష, పల్లవి ,సంధ్యా ,రమా ,స్వాతి సావిత్రి, నర్మదా, శిరీష ,పల్లవి, లలిత సమాజ సభ్యులు తదితరులు పాల్గొన్నారు వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు ,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోలాహాలంగా గణనాథుడికి చివరి రోజు పూజలు

## విజయవంతంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు
## నెహ్రూ సెంటర్ గణనాథుడికి
## ప్రత్యేక పూజలు చేసిన డీఎస్పీ తిరుపతిరావు సిఐ అంజలి





అరుణప్రభ 23 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్ గణపతి నవరాత్రులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం నియమ నిష్ఠలతో ప్రత్యేక పూజలు చేసి ప్రతిరోజు పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు భజనలు కూచిపూడి భరతనాట్యం నిర్వహించినారు బుధవారం నిమజ్జన కార్యక్రమంలో ప్రారంభానికి ముందు గణనాధునికి ప్రత్యేక పూజలు అర్చకులు సహాయంతో నిర్వహించారు.అనంతరం స్వామివారికి అత్యంత ప్రీతికరమైన సప్తహారథులతో భక్తులకు కనుల విందుగా నాగ నంది బిల్వ సింహ కుంభ రుద్ర నక్షత్ర హారతులు అందించారు అనంతరం ఉద్వాసన వేడుకకు ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ డిఎస్పి తిరుపతిరావు ఇన్చార్జ్ టౌన్ సిఐ అంజలి గణనాథుని ప్రత్యేక పూజలు పాల్గొన్నారు కమిటీ సభ్యులు అందరూ కలిసి డిఎస్పి సిఐ ఎస్ఐలకు దృశ్యాలువలతో సత్కరించినారు డిఎస్పి తిరుపతిరావు మాట్లాడుతూ లోక కళ్యాణ అర్థం వర్షాలు పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కమిటీ సభ్యులు చేసిన పూజలు ఫలించాలని అత్యంత భక్తిశ్రద్ధలతో నవరాత్రులు విజయవంతంగా చేసిన నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో నెహ్రూ సెంటర్ కమిటీ సభ్యులు భక్తులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సవ్యంగా నిర్వహించినందుకు భక్తితో పాటు ప్రజలకు అన్ని విధాల సేవా కార్యక్రమాల్లో పాల్గొని మీ వంతు సహాయ సహకారాలు ఉండాలని ప్రతి సంవత్సరం గణపతి నవరాత్రులు నిర్వహించాలని అభినందించారు . గణపతి నవరాత్రుల్లో పూజలు అందుకున్న లడ్డు కలశము పట్టు వస్త్రాలకు హుండి వేలం నిర్వహించగా మొదటి లడ్డు 81,000 వేల రూపాయలకు నాగేంద్ర సెల్ వరల్డ్ సైదులు వేలంలో దక్కించుకున్నారు 2వ లడ్డు 41,000 కు సత్య సాయి సెల్ వరల్డ్ ప్రభాకర్ దక్కించుకోగా 12వేల 500 రూపాయలకు పట్టు వస్త్రములు వేమిశెట్టి పార్థు వేలంపాట అందుకున్నారు 45,500 రూపాయలకు హుండీ పాటను ఇరుకుళ్ళ రాజేష్ తన తన అదృష్టంతో తగ్గించుకున్నారు అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించిన వాహనంపై స్వామివారిని ఉంచి గంగమ్మ ఒడిలోకి సాగనంపడానికి యువకులంతా చిందులు వేస్తూ సందడి చేశారు

# భక్తిమార్గంలో యువత ఆదర్శంగా నిలవాలి

## కైలాస్‌హిల్స్‌లో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు
## వెయ్యి మందికి పైగా అన్నప్రసాదం పంపిణీ



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23 (అరుణ ప్రభ): యువత భక్తిమార్గంలో పయనిస్తూ తెలుగు సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడేందుకు కృషి చేయాలని కైలాస్‌హిల్స్ కాలనీ పెద్దలు పిలుపునిచ్చారు. కైలాస్‌హిల్స్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు వాసాల సాయితేజ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత తొమ్మిదేళ్లుగా కైలాస్‌హిల్స్‌లో సాయితేజ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తొమ్మిదో సంవత్సరం ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దాదాపు వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ చిన్న వయసులోనే భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న సాయితేజ, ఆయన బృందాన్ని అభినందించారు. యువత భక్తిమార్గంలో ముందుకు సాగడంతో పాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించేలా కృషి చేయాలని సూచించారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. కైలాస్‌హిల్స్ కాలనీ మాజీ అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ యువతలో భక్తి, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం యువత మరిన్ని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సాయి తేజ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సహకరించిన కాలనీ పెద్దలు, మిత్రులు, స్థానికులు, కార్యక్రమానికి విచ్చేసిన సీనియర్ జర్నలిస్టులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, కాలనీవాసులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# సప్త హారతులు అందుకున్న గణనాథుడు



## ఘనంగా ముగిసిన గణనాథుడి నవరాత్రి వేడుకలు
## రుద్రాన్ష్ యువసేన సభ్యులకు ఘన సత్కారం

అరుణప్రభ 23 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో శోభాయం అనంగా మానుకోట జిల్లా కేంద్రంలో ముగిస్తాయి రుద్రాంచి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడి నవరాత్రి వేడుకలు బాప్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు వివిధ రకాల పూజలతో శోభాయమానంగా పూజించగా చివరి రోజు స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన సప్త హారతులు అయిన నాగ సింహ నంది రుద్ర కుంభ బిల్వ నక్షత్ర ఆర్తులను అర్చకులు కౌశిక్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ స్వామివారికి సమర్పించడం జరిగింది అనంతరం రుద్రాన్ను యువసేన కమిటీ సభ్యులను జిల్లా కేంద్రానికి చెందిన వాసవియన్ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ మాతే యోగిశ్వరరావు స్వయంగా సన్మానించి భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## సింగరేణి బొగ్గు సరఫరాపై బీఆర్ఎస్ మహాధర్నా
### ::: బయ్యారం విద్యుత్ కేంద్రం ఎదుట నేడు ఆందోళన



అరుణ ప్రభ:- సింగరేణి సంస్థ నుంచి జెన్‌కోకు బొగ్గు సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బయ్యారం విద్యుత్ కేంద్రం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు సారపాక టౌన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాస్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అధ్యక్షతన ఉదయం తొమ్మిది గంటలకు బయ్యారం విద్యుత్ కేంద్రం గేటు ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. మహాధర్నాకు మండల, సారపాక పట్టణ సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, మహిళా నాయకులు, ఉద్యమ నాయకులు, యువజన నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొనకంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.



## శ్రీ సాయి ఎంక్లేవ్‌లో ఘనంగా గణపతి నిమజ్జన వేడుకలు
### ::: ముఖ్యఅతిథిగా దొంతిరి హరిశంకర్ రెడ్డి

సెప్టెంబర్ 23, అరుణ ప్రభ : శ్రీ సాయి ఎంక్లేవ్ కాలనీలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న శ్రీ గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు.శ్రీ గణపతి స్వామివారి పవిత్ర లడ్డూను 95,500లకు పప్పుల జోసెఫ్ రెడ్డి, శ్రీమతి సుమలత దక్కించుకున్నారు. స్వామివారి పవిత్ర శాలువాను 20,000లకు రాజేష్ రెడ్డి, శ్రీమతి శశికళ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి , ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి లడ్డూ మరియు శాలువాలను విజేతలకు అందజేశారు. అనంతరం నిర్వహించిన శ్రీ గణపతి నిమజ్జన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు.



## వలిమ డిన్నర్ వేడుకల్లో పాల్గొన్న
## నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : కాంగ్టి మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామ ఆప్తులు బాబు గారి వాలిమా డిన్నర్ వేడుకలు ప్రతీ ప్యాలస్ వేదికగా పాల్గొని నూతన వరుడుని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన లిగౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారులి వారితో పాటు సాదుల్ సబ్ జణజ చైర్మన్, రమేష్ చౌహన్, మొహీద్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, అమిద్ డాక్టర్,అశోక్ రెడ్డి మాజీ సర్పంచ్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు .





## బజరంగ్దళ్ గణేష్‌ను దర్శించుకున్న
## నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని బజరంగ్దళ్ యూత్ ఆధ్వర్యంలో వెలసిన వినాయక నిమర్జన వేడుకల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజాలు చేసిన లిగౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు పండరి రెడ్డి నారాయణఖేల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,విఠల్ సెట్, మహిపాల్ రెడ్డి, బజరంగ్దళ్ యూత్ సభ్యులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు .

# వెంకటాపూర్‌లో పలు కార్యక్రమాల్లో సర్పంచ్ మేడిశెట్టి పద్మ బాలయ్య

**అంగన్వాడీ కేంద్రం,**
**పాఠశాలలో తనిఖీ - మధ్యాహ్న భోజనం పరిశీలన**
**స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్**





ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 23 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో సర్పంచ్ మేడిశెట్టి పద్మ బాలయ్య బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించడంతో పాటు 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ మేడిశెట్టి పద్మ బాలయ్య సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

**పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన**

అనంతరం వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సర్పంచ్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించడంతో పాటు, వారితో కలిసి పాఠశాలలోనే భోజనం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భోజనం తయారీలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

**స్వచ్ఛత హి సేవలో భాగస్వామ్యం**

గ్రామంలో నిర్వహించిన 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలోనూ సర్పంచ్ పాల్గొన్నారు. గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇళ్ల చుట్టూ, వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం, పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రజల భాగస్వామ్యంతో వెంకటాపూర్‌ను పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ మేడిశెట్టి పద్మ బాలయ్య అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్య, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నిరంతరం దృష్టి సారిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ గొట్టే శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి కరుణాకర్, వార్డు సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథునికి ఘన వీడ్కోలు





అరుణ ప్రభ:- సారపాక విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడైన శ్రీ గణనాథుని నవరాత్రి ఉత్సవాలు సారపాక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథుడు తల్లి గంగమ్మ ఒడికి చేరేందుకు నిమజ్జనానికి వైభవంగా బయలుదేరాడు. గణపతి ఆరాధనకు ప్రత్యేకమైన విశిష్టత ఉందని, ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణనాథుడిని పూజించడం ఆనవాయితీ అని భక్తులు పేర్కొన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది డ్యాన్సులు, నృత్యాలతో సందడి చేయగా, భక్తులు గణపతి నామస్మరణతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, రెండో వార్డు సభ్యుడు ముచ్చ వెంకటేశ్వర్లు (లడ్డా), 14వ వార్డు సభ్యురాలు కొమరం సావిత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లీ కృష్ణ, కాంగ్రెస్ యువ నాయకులు రహీమ్ ఖాన్, బీజేపీ నాయకులు చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి: ఎమ్మెల్యే బాలు నాయక్





అరుణ ప్రభ, దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 23 ,వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం లోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులను దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, రైతులు, సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, వర్ధిల్లాలని విఘ్నేశ్వరుని ప్రార్థించారు.దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డు సాయిబాబా దేవాలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో కొలువైన గణనాథుడిని, 11 వ వార్డులో కొలువైన వినాయకుడిని ,కన్యకా పరమేశ్వరి ఆలయ వద్ద కొలువైన గణనాథుడిని, బుధవారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం కొండమల్లేపల్లి శ్రీ సీతారామాంజనేయ, చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న గణేష్ ని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.వినాయక నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని భక్తులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నాయిని జమున మాధవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, దూదిపాల వేణుధ రెడ్డి, వేమన్ రెడ్డి, బిక్కు నాయక్, దొండేటి మల్లారెడ్డి,,లక్ష్మీనారాయణ, హరికృష్ణ ,తీరా సత్యం రెడ్డి, రవి నాయక్, బాబు రామ్ నాయక్ ,పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# రీసర్వే పనుల పరిశీలన

రామగిరి, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : రామగిరి మండలంలోని నసనకోట, పోలేపల్లి గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆర్డీఓ బుధవారం పరిశీలించారు. సరిహద్దుల నిర్ధారణ, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, భూ వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పనులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు, భూ యజమానులతో సమన్వయం చేసుకుని వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. రీసర్వే పూర్తయితే భూ రికార్డులు మరింత ఖచ్చితంగా రూపొందడంతో పాటు భూ వివాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు, రీసర్వే సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్. కె.ఆర్‌లో విద్యార్థులకు జర్నలిజంపై వర్క్‌షాప్

గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ): ఈనెల 25 న గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రామీణ ప్రాంత రిపోర్టర్లు, విద్యార్థుల కోసం జర్నలిజం కార్యశాలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాం ప్రసాద్ తెలిపారు. జర్నలిజంలో భాగంగా వార్తలు రాసే విధానం, మెలకువలు, రిపోర్టింగ్ పద్ధతులపై ఈ కార్యశాలలో అవగాహన . కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆకాశవాణి తిరుపతి కేంద్రం పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ హాజరై ప్రసంగించనున్నారు. కార్యక్రమానికి కన్వీనర్గా చరిత్ర అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.వి. రమణారెడ్డి వ్యవహరిస్తున్నారు.కార్యశాలకు సంబంధించిన బ్రోచర్ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కిరణ్మయి ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాం ప్రసాద్ ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఈ కార్యశాలకు అన్ని దినపత్రికల రిపోర్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## వినాయక మండపాన్ని దర్శించుకున్న నరసింహారెడ్డి

అరుణ ప్రభ, డిండి ,సెప్టెంబర్ 23 , దిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో కొలువుదీరిన గణనాథుని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పిఎసి ఎస్ చైర్మన్ జాల నరసింహారెడ్డి. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, దేవరకొండ నియోజకవర్గం ప్రజల పై గణనాథుని ఆశీస్సులు ఉండి సకాలంలో వర్షాలు కురిసే పాడిపంటలతో, సుఖసంతోషాలతో, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని గణనాథునికి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం కమిటీ సభ్యులు నరసింహారెడ్డిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



## సింగరాజుపల్లిలో ఐమాక్స్ లైట్ ప్రారంభం

అరుణ ప్రభ, డిండి, సెప్టెంబర్ 23,దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని దిండి మండలంలోని తన సొంత గ్రామమైన సింగరాజు పల్లి గ్రామంలో దేవరకొండ నియోజకవర్గం బి ఆర్ఎస్ నాయకులు వర్త్య రమేష్ నాయక్ తన సొంత నిధులతో బుధవారం ఐమాక్స్ లైటును స్థానిక సర్పంచ్ వడిత్య వాలి శ్రీను నాయక్ తో కలిసి ప్రారంభించారు.



## మారుతినగర్‌లో మండల పూజ

ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : మారుతినగర్ 37వ వార్డులోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో 41వ రోజు మండల పూజను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక హోమం, పూజలు, అర్చనలు చేపట్టారు. 37వ వార్డు టీడీపీ ఇంచార్జ్ ఓం ప్రకాష్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ప్రజలందరిపై అభయ ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని ఆలయ సేవకుడు శునకానంద ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## పాత్రికేయులకు ఉచిత వైద్య శిబిరం



ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : శ్రీ సత్యసాయి జిల్లా పాత్రికేయుల కోసం ఈ నెల 26న పుట్టపర్తిలోని సాయి ఆరామం హోటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయం తెలిపింది. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభం కానుంది. బెంగళూరులోని వైదేహి హాస్పిటల్, హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, తిరుపతిలోని ఎస్వీఐఎంఎస్, అనంతపురంలోని కిమ్స్-సవీరా వైద్య బృందాలు సేవలందించనున్నాయి. గుండె, నరాలు, మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థ తదితర విభాగాల నిపుణులు అందుబాటులో ఉంటారు. ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్‌తో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. మహిళలకు పాప్ స్మియర్, క్లినికల్ బ్రెస్ట్ పరీక్ష, మామోగ్రఫీ తదితర పరీక్షలు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం కోరింది.

# ప్రకృతి ప్రకోపం.. ఈదురుగాలులకు అతలాకుతలం

### మండల వ్యాప్తంగా పలు గ్రామాలు, మొరంపల్లి బంజర్, వేపలగడ్డలో గాలి బీభత్సం

### నేలరాలిన చెట్లు విద్యుత్ స్తంభాలు, పగిలిన రేకులు



ప్రకృతి ఒక్కసారిగా తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. బుధవారం వీచిన బలమైన ఈదురుగాలులు మండల వ్యాప్తంగా పలు గ్రామాల తో పాటు మొరంపల్లి బంజర్ గ్రామంతో పాటు వేపలగడ్డ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపాయి. క్షణాల్లోనే గాలుల వేగం పెరగడంతో భారీ వృక్షాలు నేలకొరిగి, విద్యుత్ స్తంభాలు విరిగిపడి, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు ఇళ్లపై, రహదారులపై పడటంతో ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ తీగలు తెగిపడటంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై చెట్లు అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రకృతి వైపరీత్యం కారణంగా సంభవించిన నష్టంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా ఇళ్లపై చెట్లు పడటంతో బాధిత కుటుంబాలు నష్టాన్ని చవిచూశాయి. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం సంభవించకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



**అప్రమత్తతే రక్షణ**

ఈదురుగాలులు, భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించడం, విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించడం, నష్టాన్ని అంచనా వేసి బాధితులకు సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గంగమ్మ చెంతకు చేరిన గణనాథుడు.... బై బై గణేష

### ::: లిటిల్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో



సీరోల్ / అరుణ ప్రభ : మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండల కేంద్రంలోనికాంపల్లి గ్రామ బస్టాండ్ సెంటర్ లో వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రులుగా పూజలు అందుకున్న వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, మంగళహారతులు ఇచ్చారు. గణనాధుని టాక్టర్ పై ఊరేగింపు బయలుదేరారు ఆట పాటలతో నిమజ్జనా న్ని ఘనంగా నిర్వహించారుఅనంతరం గణేష్ మండపం వద్ద



నిర్వాహకులు, భక్తులు, చిన్నారులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు లడ్డు వేలంపాట వేయగా దుంపటి మురళి స్వరూప దంపతులు దక్కించుకున్నారు కళ్ళే శంబు నీరుటి రవి లక్ష్మీ దంపతులు దక్కించుకుందాం పట్టు వస్త్రాలు సురేష్ విగ్రహ దాతగా పూలసాని శ్రీనివాసరెడ్డి సులోచన దంపతులు ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ధర్మవరంలో ఉలవల విత్తనాల పంపిణీ

ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : ఇటీవల కురిసిన వర్షాలను సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించినట్లు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు తెలిపారు. బుధవారం పోతుకుంట రైతు సేవా కేంద్రంలో ఉలవల విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ధర్మవరం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉలవల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇటీవల మండలంలో 44.6 మి.మీ. వర్షపాతం నమోదైందని, నేలలోని తేమ ఉలవల సాగుకు అనుకూలంగా ఉందన్నారు. రైతులు ఆధార్, పాస్‌బుక్, మొబైల్ ఫోన్‌తో ఆర్ఎస్‌కేలో నమోదు చేసుకుని విత్తనాలు పొందాలని సూచించారు. పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డైరెక్టర్ కాటమయ్య, గొట్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు రామాంజనేయులు, మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## భజనలు, కీర్తనలతో గణనాథుడి నిమజ్జనానికి తరలింపు

### పూర్వకాలపు సంప్రదాయాన్ని గుర్తుచేసిన గౌడ సంఘం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 23: ఎల్లారెడ్డిపేట మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. డీజేలకు దూరంగా భజనలు, కీర్తనలు ఆలపిస్తూ భక్తి పారవశ్యంతో గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా ట్రాక్టర్‌పై అలంకరించి, పూలతో అందంగా ముస్తాబు చేసి ఊరేగింపుగా నిమజ్జన ప్రదేశానికి తీసుకెళ్లారు. భక్తులు భజనలు, కీర్తనలు ఆలపిస్తూ, గణపతి నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, యువత, సంఘం సభ్యులు భక్తి శ్రద్ధలతో నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. డీజేలు, అధిక శబ్దాలకు దూరంగా భక్తి గీతాలు, భజనలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా పూర్వకాలపు వినాయక నిమజ్జన సంప్రదాయాన్ని గౌడ సంఘం గుర్తు చేసింది. భక్తి, సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. 'గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.




## బీఎస్పీ నేత రాంప్రసాద్‌కు సన్మానం

ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి మాల్యవంతం రాంప్రసాద్‌ను ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ధర్మవరంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశగాళ్ల వెంకటేష్ శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బహుజనుల సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారం కీలకమన్నారు. సామాజిక న్యాయం, బహుజనుల అభ్యున్నతికి బీఎస్పీ కృషి చేస్తోందన్నారు. రాంప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ బహుజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహం ముందు ఫ్లెక్సీపై అభ్యంతరం

ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై ఏపీ మాదిగ రక్షణ పోరాట సమితి (ఏపీ ఎమ్మార్పీఎస్) అభ్యంతరం వ్యక్తం చేసింది. విగ్రహం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని గతంలోనే మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపింది. పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. జాతీయ నాయకుల విగ్రహాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 115, 118 ప్రకారం చర్యలు చేపట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.



## సీనియర్ జర్నలిస్టు కృష్ణారెడ్డి మృతి

బత్తలపల్లి, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : బత్తలపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు, 'వార్త' విలేకరి కృష్ణారెడ్డి (53) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారు. ఎన్నో ఏళ్లుగా 'వార్త'లో పనిచేస్తూ జర్నలిజంలో మంచి గుర్తింపు పొందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కృష్ణారెడ్డి మృతదేహానికి పలువురు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, 'వార్త' అనంతపురం జిల్లా బ్రాంచ్ మేనేజర్ బి. మధుసూదన్, బ్యూరో ఇన్‌చార్జి బోగేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు శివయ్య, శ్రీ సత్యసాయి జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు ఉన్నారు. కృష్ణారెడ్డి అంత్యక్రియలను బత్తలపల్లి సమీపంలోని గంటాపురంలో గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## వెస్టిండీస్‌తో సిరీస్‌కు టీమిండియా మేనేజర్‌గా వికాస్ కత్యాల్

వెస్టిండీస్‌తో స్వదేశంలో జరగనున్న సిరీస్‌కు టీమిండియా మేనేజర్‌గా ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) డైరెక్టర్ వికాస్ కత్యాల్ నియమితులయ్యారు. ఈ మేరకు డీడీసీఏ బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కత్యాల్ నియామకం తమ అసోసియేషన్‌తో పాటు ఢిల్లీ క్రికెట్‌కు గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలియజేసింది. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న ఈ పర్యటనలో భాగంగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. తిరువనంతపురంలో జరగనున్న తొలి వన్డేతో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. మిగిలిన వన్డేలకు గువాహటి, న్యూ చండీగఢ్‌లు ఆతిథ్యం ఇవ్వనుండగా.. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు వేదికలుగా టీ20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌లోని వన్డే జట్టుకు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా వన్డే స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. ఇక టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహిస్తాడు.





## కమ్మగూడ శివాజీ నగర్ కాలనీ ఫేజ్ 2లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

### 1.06666 లక్షలకు గణనాథుని లడ్డూ కైవసం

### లడ్డు వేలం పాటలో దక్కించుకున్న మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కోషిక ఐలయ్య

ఆదిభట్ల సర్కిల్,సెప్టెంబర్ 23, అరుణ ప్రభ: ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూర్ డివిజన్ కమ్మగూడ శివాజీనగర్ ఫేజ్-2లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. బుధవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తొర్రూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కోషిక ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.అనంతరం నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలంపాట ఉత్సాహంగా సాగింది.లడ్డూను రూ.1,06,666 రూపాయలకు మాజీ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్,తొర్రూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోషిక ఐలయ్య దక్కించుకున్నారు. సాక్షి రిపోర్టర్ సిలివేరు యాదగిరి మధులిక దంపతులు రూ.18,100రూపాయలకు వుండి వేలం పాటలో దక్కించుకున్నారు,కలశాన్ని కవిత గోవర్ధన్ నాయక్ దంపతులు రూ.33,500 రూపాయలకు సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు వేలంపాటలో పాల్గొన్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్యంగౌడ్,ముతక్ పల్లి వెంకట్ రెడ్డి,నక్క శేఖర్ యాదవ్, వెంకటేశ్వర రెడ్డి,పెంబళ్ల శివకుమార్,రామావత్ రాము నాయక్,బ్రహ్మ చారి,పెద్దులు, కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

# లింగమూర్తి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్న మెమోరియల్ ట్రస్ట్

## 13వ వార్షికోత్సవం, 13వ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

అరుణప్రభ 23 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 23: సేవా కార్యక్రమాలకు చిరునామాగా నిలుస్తున్న లింగమూర్తి మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 13 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, అలాగే ట్రస్ట్ వ్యవస్థాపకుల కుటుంబ సభ్యుడు లింగమూర్తి 13వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగులను పరామర్శించి, వారికి పండ్లు అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా లింగమూర్తి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ ధర్మసోత్ నారాయణ సింగ్ మాట్లాడుతూ.. తన తమ్ముడు లింగమూర్తి జ్ఞాపకార్థం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి గత 13 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం, వారి విద్యకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా వృద్ధులు, అభాగ్యులు, నిరుపేదలను ఆదుకుంటూ, వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తూ ట్రస్ట్ ముందుకు సాగుతోందన్నారు. సేవా కార్యక్రమాలను కేవలం ఒకరోజుకే పరిమితం చేయకుండా నిరంతరం కొనసాగిస్తున్నామని



తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, అవసరమైన వారికి అండగా నిలుస్తామని ధర్మసోత్ నారాయణ సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, ధారావత్ బాలాజీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ విస్తృత పర్యటన



ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం నియోజకవర్గంలో మంత్రి, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఈ నెల 25, 26 తేదీల్లో విస్తృతంగా పర్యటించనున్నట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు తెలిపారు. 25న కార్యక్రమాలు: ఉదయం 10 గంటలకు అటల్ బిహారీ వాజ్‌పేయి సర్కిల్ వద్ద 72 నూతన 104 మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కళాజ్యోతి సర్కిల్ వద్ద బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు ఎన్డీఏ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తారు. 26న కార్యక్రమాలు: ఉదయం 9 గంటలకు ఎల్.సి.కె.పురంలో సద్భావన భవన్‌కు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో పాత్రికేయుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ధర్మవరం చెరువు సుందరీకరణపై ఎస్పీఏతో నిర్వహించే సమీక్షలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కళాజ్యోతి సర్కిల్‌లో జరిగే శతవర్షోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని హరీష్‌బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## 25న డీ వార్మింగ్ కార్యక్రమం

ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో డీ వార్మింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఉమామహేశ్వర అధ్యక్షతన బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులందరూ పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని, అనారోగ్యంతో ఉన్న వారికి నులిపురుగుల నివారణ మాత్రలు ఇవ్వకూడదని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్, విద్య, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని గోపాల్ నాయక్ కోరారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పుష్పలత, శ్వేత, జయంత్, లక్ష్మీదత్త, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగా భవాని, మలేరియా అసిస్టెంట్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నిజాం చెరువులో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

**ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు**

**గణనాథునికి ఘనంగా వీడ్కోలు**

**ఏర్పాట్ల కోసం జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులను మండలాలకు కేటాయించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**







అరుణప్రభ 23 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : నిజాం, జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఉన్న చెరువులో వినాయక నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు తీసుకువచ్చిన గణపతి విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు క్రేన్ సహాయంతో, మున్సిపల్ కమిషనర్ చెరువులో ఏర్పాటు చేసిన నీటితెప్పలపై దిగి విగ్రహాలను స్వయం గా నిమజ్జనం చేయడంతో పాటు....నిమజ్జన ప్రక్రియను పరిశీలించారు ఈ సందర్భంగా... నిజం చెరువు వద్ద గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. చెరువుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి విగ్రహాలు నిమజ్జనానికి రానున్నాయని పేర్కొన్నారు. దీనితో పాటు జిల్లా పరిధిలో ఉన్న అన్నీ నిమజ్జన పాయింట్ ల వద్ద అధికారులు తగు ఏర్పాట్లు చేసారన్నారు వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు విధులు నిర్వహిస్తున్న పోలీస్, రెవిన్యూ, మున్సిపల్,విద్యుత్, ఇరిగేషన్, మత్స్య శాఖ, ఆర్ అండ్ బి, ఫైర్ తదితర అన్నీ శాఖల అధికారులు నిమగ్నమై ఉన్నారు, వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణనాథుల విగ్రహాలను భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా నిజం చెరువు వద్దకు తీసుకురాగా క్రేన్ల సహాయంతో ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పల్లో చెరువు నీటిలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు , వైద్య శిబిరాలు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు భక్తులు ప్రశాంత వాతావరణంలో గణనాథుడి నిమజ్జన వేడుకలను నిర్వహించుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నిజాం చెరువు లో నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఈ సందర్భంగా సిపిఓ శ్రీనివాసరావు కురవి మండలం, జిల్లా పశువైద్య అధికారి చిన్న గూడూరు, నెల్లికుదురు జి.మరియన్న, వివిధ మండలాలలో అన్ని విభాగాల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## వర్షిత కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత

ధర్మవరం, సెప్టెంబరు 23; (అరుణ ప్రభ న్యూస్) : వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన నాలుగో తరగతి విద్యార్థిని రాగే వర్షిత కుటుంబానికి ఉపాధ్యాయులు చేయూతనందించారు. ధర్మవరంలోని శాంతినగర్ మున్సిపల్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ వంతుగా రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించారు. హెచ్‌ఎం జానకి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం వర్షిత కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేసింది. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ మృతిచెందిన విద్యార్థినిని తిరిగి తీసుకురాలేమని, ఆమె జ్ఞాపకార్థం కుటుంబానికి సాయం అందించినట్లు తెలిపారు. కుటుంబానికి మనోధైర్యం కలగాలని, వర్షిత ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు భారతి, అనిత, అరుణ, ప్రవల్లిక, సాయి గణేష్, ఆదిశేషు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ డీఎస్సీఎస్‌సీడీఎస్ ఈడీగా వీ. ఉపేంద్ర బాధ్యతల స్వీకరణ

## ఎస్సీ సంక్షేమ పథకాల అమలుకు మరింత ప్రాధాన్యం.ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా చర్యలు.

అరుణప్రభ మహబూబాబాద్ సెప్టెంబర్ 23 : మహబూబాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కాస్ట్స్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీఎస్సీఎస్‌సీడీఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వీ. ఉపేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు.తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మహబూబాబాద్ జిల్లాలో పోస్టింగ్ లభించింది.ఇంతకుముందు ఆమె ఖమ్మం జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కాస్ట్ డెవలప్‌మెంట్ (ఎస్ సి పి) శాఖ ద్వారా జారీ చేసిన జీవో ఆర్ టి నెంబర్ .233,తేదీ: 11.09.2026లో రాష్ట్రంలోని మూడు షెడ్యూల్డ్ కాస్ట్స్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు కేటాయించింది.ఇందులో భాగంగా వీ. ఉపేంద్రను మహబూబాబాద్ డీఎస్సీఎస్‌సీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోస్టింగ్.**

ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఖమ్మం లో ఈవో,డీఎస్సీఎస్‌సీడీఎస్ గా పనిచేస్తున్న వీ. ఉపేంద్రకు మహబూబాబాద్‌డీఎస్సీఎస్‌సీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.ఈ పోస్టింగ్ ప్రస్తుతం ఉన్న ఖాళీకి అనుగుణంగా చేపట్టినట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.అలాగే పదోన్నతి పొందిన అధికారులు తమకు కేటాయించిన పోస్టుల్లో 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని,సంబంధిత శాఖాధికారులు, జిల్లా కలెక్టర్లు తదుపరి అవసరమైన చర్యలు తీసుకుని అధికారులు విధుల్లో చేరినట్లు ప్రభుత్వానికి అనుగుణ నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



**ఎస్సీ సంక్షేమంపై దృష్టి**

మహబూబాబాద్ జిల్లాలో ఎస్సీ వర్గాల సామాజిక,ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం డీఎస్సీఎస్‌సీడీఎస్ ప్రధాన బాధ్యతల్లో ఒకటి,ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన వీ. ఉపేంద్ర ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, ఆర్థిక సహాయ పథకాలపై అర్హులైన లబ్ధిదారులకు అవగాహన కల్పించడం, దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక, పథకాల అమలులో పారదర్శకత, క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు.

**సిబ్బంది అభినందనలు.**

బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయ సిబ్బంది, అధికారులు వీ. ఉపేంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్సీ సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డీఎస్సీఎస్‌సీడీఎస్ కార్యకలాపాలను మరింత ప్రజలకు సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



## వినాయకుడి వద్ద అన్నదానం ప్రారంభించిన కలెక్టర్

**ఉద్యోగులు, సిబ్బందికి స్వయంగా వడ్డించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**అందరితో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది, సందర్శకులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులు, సిబ్బందితో కలిసి భోజనం చేశారు. వినాయకుడి సన్నిధిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని వడ్డించడం ఉద్యోగులు, సిబ్బందిలో ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీఏఓ అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన అధికారి శరత్ బాబు, డీవైఎస్ఓ రాందాస్, కలెక్టరేట్ ఏవో, పర్యవేక్షకులు రాంరెడ్డి, శ్రీకాంత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్



అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్.23 : మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ బుధవారం గంగారం, గూడూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలు చేస్తున్న వివిధ కేంద్ర మరియు రాష్ట్ర ఆరోగ్య పథకాల రికార్డులను, అలాగే సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనపై వైద్యాధికారితో సమీక్ష నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు అలాగే 0--5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అవసరమైన మందులు, పరీక్షా కిట్లు తదితర వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారికి సూచించారు. జిల్లాలో జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సిబ్బంది, మందులు మరియు ఇతర అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గంగారం మండలంలోని వైద్యాధికారి డాక్టర్ కిరణ్, గూడూరు మండలంలోని వైద్యాధికారి డాక్టర్ పవన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# రాచర్ల గొల్లపల్లిలో ఘనంగా బొజ్జ గణపయ్య నిమజ్జనం

## ఘనంగా బొజ్జ గణపయ్య నిమజ్జనం
## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అన్నప్రసాదం పంపిణీ

ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో పూసల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బొజ్జ గణపయ్య నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేసి స్వామివారిని కొలిచారు. అనంతరం పూసల సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో రాచర్ల గొల్లపల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. భక్తుల సందడి, పూజా కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పూసల సంఘం గౌరవ అధ్యక్షుడు మద్దివేణి లక్ష్మణ్, అధ్యక్షుడు మద్దివేణి కృష్ణ, కోశాధికారి మద్దివేణి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మద్దివేణి దేవేందర్, ఉపాధ్యక్షులు కోనేటి సతీష్, మద్దివేణి శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాసు, ప్రచార కార్యదర్శి ముద్రకోల శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ ముద్రకోల



కృష్ణ, కార్యవర్గ సభ్యులు ముద్రకోల ఆంజనేయులు, శిర్ల వెంకటేశం, కోనేటి రమేష్, ముద్రకోల రమేష్, గుడ్ల రమేష్, గుడ్ల దేవరాజ్, ముద్రకోల శ్రీనివాస్, ముఖ్య సలహాదారు శిర్ల లక్ష్మణ్, మహిళా సంఘ సభ్యులు, గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, పలువురు రాజకీయ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదిభట్ల కురుమ సంఘం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

## 1,10,000 లకు గణనాథుని లడ్డూ కైవసం
## లడ్డు వేలం పాటలో దక్కించుకున్న ఉప్పు మల్లేష్ కురుమ



ఆదిభట్ల సర్కిల్, సెప్టెంబర్ 23, అరుణ ప్రభ: ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని ఆదిభట్ల డివిజన్ కురుమ సంఘం లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. బుధవారం



కురుమ సంఘం వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లడ్డు వేలం పాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గణనాథుని లడ్డూ వేలంపాట ఉత్సాహంగా సాగింది. లడ్డూను రూ. 1,10, 000 లక్ష పది వేల రూపాయలకు కురుమ సంఘం సభ్యులు ఉప్పు మల్లేష్ కురుమ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరే జంగయ్య, కోరే శివకుమార్, కోరే మల్లేష్, నల్లవోలు పాండు రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో మహిళా యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జనం

## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. గణపయ్యకు ఘనంగా వీడ్కోలు



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మహిళా యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణనాథుడికి మహిళా సభ్యులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ పూజలు, హారతులు సమర్పించి స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. మహిళా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలకు 9వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు



అందుకున్న గణపయ్యకు చివరి రోజు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేక పూజల అనంతరం గణనాథుడి విగ్రహాన్ని భక్తులు అలంకరించి, భక్తిగీతాలు, నినాదాల మధ్య నిమజ్జనానికి తరలించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, గణపయ్య ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమంతో గ్రామంలో ఉత్సవ సందడి నెలకొంది.




# హామీల అమలుకు ఉద్యమకారుల రిలే దీక్షలు

## 7వ రోజుకు చేరిన
## అల్వాల్ తెలంగాణ ఉద్యమకారుల నిరాహార దీక్షలు

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడో రోజుకు చేరుకున్నాయి. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. 7వ రోజు రిలే నిరాహార దీక్షలో పుట్టాల కృష్ణ, సత్తయ్య కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, సీనియర్ జర్నలిస్టు శ్రీరాములు హాజరై ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన పోరాటాన్ని ప్రభుత్వం గుర్తించి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు జరిగే వరకు ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్లోళ్ల సురేందర్ రెడ్డి, ఏడి దయాకర్, ఢిల్లీ పరమేష్, మల్లేష్, నగేష్, సంగమేశ్వర్, రమేష్ తదితరులు పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు.



# ఆయుర్వేదంపై అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం

అల్వాల్: ఆయుర్వేద డే ధన్వంతరి జయంతి సందర్భంగా డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు ఆయుర్వేద వైద్యం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. ఆయుర్వేదానికి ఆద్యుడైన శ్రీమహావిష్ణువు అవతారమే ధన్వంతరి భగవానుడని పేర్కొన్నారు. ప్రస్తుత జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రోజువారీ అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ పెందలకడనే నిద్రలేవడం, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని తెలిపారు. ఆహారపు అలవాట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, క్రమబద్ధమైన జీవన విధానాన్ని అలవర్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ శైలజ వివరించారు. ఆయుర్వేద వైద్యం ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అనగ్, వైద్య సిబ్బంది, జేఏసీ నాయకులు పట్లోళ్ల సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాగట్లపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

## ::: ఇద్దరికి తీవ్ర గాయాలు




ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 23 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో దుమాల గ్రామానికి చెందిన బైరి బాల్, నర్స్ ప్రశాంత్‌కు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.





# మానుకోటలో ఘనంగా గణేష్ శోభాయాత్ర

అరుణప్రభ 23 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. శోభాయాత్రగా సాగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మరియు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ ప్రజలందరికీ గణేష్ నిమజ్జన శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తజనుల జయజయధ్వానాలు, డప్పు వాయిద్యాల నడుమ వినాయక ప్రతిమల ఊరేగింపు వైభవంగా సాగింది. స్థానిక నాయకులు, పోలీసు అధికారులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.





# జగదేవపూర్‌లో వైభవంగా వినాయక నిమజ్జన శోభాయాత్ర

సిద్దిపేట జిల్లా . జగదేవపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర ఆలయములో నెలకొల్పబడిన వినాయక నవరాత్రుల ఉత్సవాలలో ఈరోజు చివరి రోజు విగ్రహ దాత వెంకటేశ్వర ట్రస్టు చైర్మన్ బుద్ధ మహేందర్ దంపతులు ఆర్యవైశ్య మహిళలు పురుషులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు . తీర్థ అన్న ప్రసాద అనంతరం వేలం పాటలో రాబోయే వినాయక చవితికి విగ్రహ దాత గా బుద్ధ మహేందర్ ఒక లక్ష యాభై ఒక వేల రూపాయలకు దక్కించుకున్నారు స్వామి వారి లడ్డు ప్రసాదం 28 వేల రూపాయలకు రావికంటి బాల నర్సయ్య దక్కించుకున్నారు అనంతరం గణనాథుని నిమజ్జనం శోభాయాత్ర ను ఆర్యవైశ్య మహిళలు సాంప్రదాయ కోలాటలతో స్వామివారిని ప్రధాన రోడ్డు ద్వార గంగమ్మ ఒడి కిచేర్చారు. ఈ శోభాయాత్రలో ' కీలకంగా ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు గుబ్బ శ్రీనివాసరావు, అయ్యప్ప దేవాలయ ట్రస్టు చైర్మన్ బుద్ధ వెంకటయ్య ప్రధాన కార్యదర్శులు పెద్ది శ్రీనివాస్, చిగుళ్లపల్లి వెంకటేశం కోశాధికారులు మడిపడిగ చంద్ర శేఖర్, అమర శ్రీనివాస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లాల వెంకటేష్ ఆర్యవైశ్య మహిళలు పురుషులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా నిర్వహించారు

# భక్తిశ్రద్ధలతో అభీష్ట వరసిద్ధి వినాయకుని సన్నిధిలో భజన

## అభయాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో ఘనంగా భజన కార్యక్రమం





అల్వాల్: వెంకటరమణ కాలనీలోని అభీష్ట వరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధిలో అభయాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, భక్తి కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీ భోగేశ్వరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పవిత్రమైన భజన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. భక్తి గీతాలు, భజనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమం భక్తుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిసింది.

# పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

## ప్రకృతి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన.. చెట్ల సంరక్షణకు ప్రతిజ్ఞ



ఆల్వాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆల్వాల్ ఆధ్వర్యంలో ఆల్వాల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో వివిధ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రారంభించినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధి లయన్ గౌరారం అంజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. మొక్కల పెంపకం, చెట్ల సంరక్షణ వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులచే చెట్లను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పి. సత్యనారాయణరావు, సి.హెచ్. కిష్టయ్య, లయన్ పి. జయంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఇందిర, ఉపాధ్యాయులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా మార్కెట్‌లోకి ఎస్ఎస్ఈఎల్..
# తొలి 175 ఎంవీఏ ఈహెచ్‌వీ ట్రాన్స్‌ఫార్మర్ ఎగుమతి

హైదరాబాద్, : విద్యుత్ ప్రసార రంగంలో అంతర్జాతీయ విస్తరణను మరింత బలోపేతం చేసుకుంటూ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (ఎస్ఎస్ఈఎల్) మరో కీలక మైలురాయిని సాధించింది. అమెరికా మార్కెట్‌లోకి సంస్థ తొలిసారిగా అడుగుపెట్టింది. అమెరికాకు తన తొలి 175 ఎంవీఏ, 345 కేవీ ఎక్స్‌ట్రా హై వోల్టేజ్ (ఈహెచ్‌వీ) పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా ఎగుమతి చేసింది. అంతర్జాతీయ విద్యుత్ ప్రసార మార్కెట్లలో ఎస్ఎస్ఈఎల్ సామర్థ్యాలకు ఈ ఎగుమతి మరో ముఖ్యమైన గుర్తింపుగా నిలిచిందని సంస్థ వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ నైనీ తయారీ కేంద్రంలో ఈ అధిక సామర్థ్యం కలిగిన ఈహెచ్‌వీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తయారు చేశారు. అత్యున్నత ఇంజినీరింగ్, నాణ్యత, పనితీరు ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని రూపొందించినట్లు ఎస్ఎస్ఈఎల్ తెలిపింది. అంతర్జాతీయ విద్యుత్ సంస్థల అవసరాలకు అనుగుణంగా అధిక సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యాన్ని సంస్థ సొంతం చేసుకుందని పేర్కొంది. అమెరికా మార్కెట్‌లోకి తొలి ఈహెచ్‌వీ ట్రాన్స్‌ఫార్మర్ ఎగుమతి చేయడం ద్వారా అమెరికాతో పాటు ఇతర అంతర్జాతీయ విద్యుత్ ప్రసార మార్కెట్లలో కార్యకలాపాలను విస్తరించేందుకు మరింత బలమైన పునాది ఏర్పడిందని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సీఈఓ శరత్ చంద్ర కొల్లా మాట్లాడుతూ.. అమెరికాకు తమ తొలి ఈహెచ్‌వీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎగుమతి చేయడం ఎస్ఎస్ఈఎల్ అంతర్జాతీయ ప్రస్థానంలో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఇది సంస్థ ఇంజినీరింగ్ నైపుణ్యం, తయారీ సామర్థ్యాలు, నాణ్యత పట్ల నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో తమ ఉనికిని మరింత విస్తరించేందుకు ఈ విజయం దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే 12 నుంచి 18 నెలల్లో నైనీ ట్రాన్స్‌ఫార్మర్ తయారీ యూనిట్ ద్వారా రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల స్థాయిలో ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు శరత్ చంద్ర కొల్లా తెలిపారు. యూరప్ మార్కెట్‌లో పవర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు అవసరమైన అనుమతులు, ధ్రువీకరణలు పొందేందుకు కూడా చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించిన తర్వాత యూరప్ సహా ఇతర కీలక అంతర్జాతీయ మార్కెట్లలోనూ తమ కార్యకలాపాలను విస్తరించేందుకు సంస్థ ప్రయత్నాలు కొనసాగిస్తోందని ఆయన తెలిపారు. ఎస్ఎస్ఈఎల్ ప్రెసిడెంట్ సుధీర్ వెన్నం మాట్లాడుతూ.. నైనీ తయారీ కేంద్రం నుంచి అమెరికాకు తొలి 175 ఎంవీఏ, 345 కేవీ క్లాస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా రవాణా చేయడం సంస్థకు కీలక మైలురాయిగా పేర్కొన్నారు. కఠినమైన అంతర్జాతీయ విద్యుత్ సంస్థల ప్రమాణాలకు అనుగుణంగా భారీ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను తయారు చేసి, సరఫరా చేయగల తమ సామర్థ్యాన్ని ఈ ఎగుమతి ధ్రువీకరిస్తోందని తెలిపారు. కడపతో పాటు నైనీని కూడా అధునాతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మార్కెట్లకు విశ్వసనీయమైన ఎగుమతి కేంద్రాలుగా అభివృద్ధి చేయడంలో ఈ విజయం కీలకంగా నిలుస్తుందని సుధీర్ వెన్నం పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ గ్రిడ్‌ల విస్తరణ, విద్యుదీకరణ, పునరుత్పాదక ఇంధన వనరులను విద్యుత్ గ్రిడ్‌లతో అనుసంధానం చేయడానికి భారీగా పెట్టుబడులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అధిక సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ ప్రసార పరికరాలకు డిమాండ్ పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తమ తయారీ సామర్థ్యాలను మరింత విస్తరిస్తున్నామని సుధీర్ వెన్నం తెలిపారు. అమెరికాకు తొలి ఈహెచ్‌వీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎగుమతి చేయడం ద్వారా సంస్థ అంతర్జాతీయ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు, ఆదాయ వనరులను మరింత విభిన్నీకరించేందుకు బలమైన పునాది ఏర్పడిందని చెప్పారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో 1994లో ఎన్. విశ్వేశ్వరరెడ్డి స్థాపించారు. గత మూడు దశాబ్దాలుగా విద్యుత్, ఇంధన మౌలిక వసతుల రంగంలో సంస్థ తన కార్యకలాపాలను క్రమంగా విస్తరించుకుంటూ వస్తోంది. ప్రారంభంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, సర్వీసింగ్ సంస్థగా ప్రస్థానం ప్రారంభించిన ఎస్ఎస్ఈఎల్ ప్రస్తుతం పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, రియాక్టర్లు, కండక్టర్లు, అల్లాయ్‌లు, పునరుత్పాదక ఇంధన పరిష్కారాలు తదితర విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. విద్యుత్ రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా సంస్థ తన ఉత్పత్తి, ఇంజినీరింగ్ సామర్థ్యాలను విస్తరించుకుంది. సౌర, పవన, జలవిద్యుత్ రంగాల్లోనూ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు విద్యుత్, ఇంధన మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణం (ఈపీసీ) సామర్థ్యాలను కూడా అభివృద్ధి చేసుకుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, తయారీ సామర్థ్యం, ఇంజినీరింగ్ నైపుణ్యం, నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇస్తూ భారతదేశంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో విద్యుత్ ప్రసార పరిష్కారాలను అందించడంపై దృష్టి సారిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న వివిధ తయారీ కేంద్రాల్లో ఎస్ఎస్ఈఎల్‌కు సుమారు 48,000 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తయారీ సామర్థ్యం ఉంది. రాబోయే సంవత్సరాల్లో మరో 1,10,000 ఎంవీఏ తయారీ సామర్థ్యాన్ని ఏర్పాటు చేసేందుకు సంస్థ విస్తరణ ప్రణాళికలను అమలు చేస్తోంది. ఈ విస్తరణ పూర్తయితే సంస్థ మొత్తం ట్రాన్స్‌ఫార్మర్ తయారీ సామర్థ్యం సుమారు 1,58,000 ఎంవీఏకు చేరుకోనుంది. అంతర్జాతీయ విద్యుత్ మౌలిక వసతుల మార్కెట్లలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అధిక సామర్థ్యం కలిగిన ఈహెచ్‌వీ, పవర్ ట్రాన్స్‌మిషన్ పరికరాల తయారీ సామర్థ్యాలను ఎస్ఎస్ఈఎల్ నిరంతరం పెంచుతోంది. ముఖ్యంగా విద్యుత్ గ్రిడ్‌ల విస్తరణ, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల పెరుగుదల, విద్యుదీకరణ వేగవంతం కావడంతో ప్రపంచవ్యాప్తంగా అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లకు అవసరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ విస్తరణ ప్రణాళికలకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాకు తొలి 175 ఎంవీఏ, 345 కేవీ ఈహెచ్‌వీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎగుమతి చేయడం ద్వారా అంతర్జాతీయ విద్యుత్ ప్రసార పరికరాల సరఫరా వ్యవస్థలో ఎస్‌-ఎస్ఈఎల్ తన కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా అడుగు వేసింది. నైనీ తయారీ కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ అంతర్జాతీయ విస్తరణ భవిష్యత్తులో అమెరికాతో పాటు యూరప్, ఇతర అంతర్జాతీయ మార్కెట్లలో సంస్థకు మరిన్ని అవకాశాలను అందించే లక్ష్యంతో కొనసాగుతున్నట్లు ఎస్ఎస్ఈఎల్ తెలిపింది.





# కిసాన్ వికాస్ పత్ర.. డబ్బు రెట్టింపు చేసే పోస్టాఫీస్ పథకం




హైదరాబాద్ : పెట్టుబడులపై రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని వారికి పోస్టాఫీస్ అందించే చిన్న మొత్తాల పొదుపు పథకాలు ఒక మార్గంగా ఉన్నాయి. స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులకు దూరంగా ఉండాలనుకునే వారికి అందుబాటులో ఉన్న పథకాల్లో లిలికిసాన్ వికాస్ పత్ర (కేవీపీ) ఒకటి. ఈ పథకంలో రూ.1,000 నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. ప్రస్తుతం ఈ పథకంపై 7.5 శాతం వార్షిక వడ్డీ అందుతోంది. ఈ వడ్డీ రేటు ప్రకారం పెట్టుబడి మొత్తం 115 నెలల్లో అంటే 9 సంవత్సరాల 7 నెలల్లో రెట్టింపు అవుతుందని అందుబాటులో ఉన్న వివరాలు చెబుతున్నాయి. కిసాన్ వికాస్ పత్ర పథకంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ప్రధానంగా దీర్ఘకాలిక పొదుపు, నిర్ణీత వడ్డీ రేటు వంటి అంశాలు ప్రాధాన్యంగా ఉంటాయి. పెట్టుబడిపై స్థిరమైన రాబడి కోరుకునే వారు ఈ తరహా చిన్న మొత్తాల పొదుపు పథకాలను పరిశీలిస్తుంటారు. మార్కెట్ ఆధారిత పెట్టుబడులతో పోలిస్తే స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావం లేకుండా పెట్టుబడిని కొనసాగించాలనుకునే వారికి కేవీపీ ఒక ఎంపికగా అందుబాటులో ఉంది.



# దండుమరమ్మ ఆలయంలో తనిఖీ

అల్వాల్: ఎండోమెంట్స్ కమిషనర్ ఆదేశాల మేరకు శ్రీశ్రీశ్రీ దండుమరమ్మ దేవాలయంలో తెలంగాణ ఆర్య సమాఖ్య పరుశరామ ఆర్య జేఏసీ కన్వీనర్ జయశర్మ, అర్చక సమాఖ్య ప్రతినిధి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని పలు అంశాలను పరిశీలించారు. తనిఖీలో గుర్తించిన విషయాలను ఎండోమెంట్స్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం డీసీ వినోద్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆలయానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, పి. రాజు, దళిత రత్న రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ట్రైన్ టికెట్ ఛార్జీలు పెరుగుతున్నాయా?
# యూపీఐ కొత్త రూల్స్‌తో ప్రయాణికుల్లో కలకలం

రైల్వే టికెట్ల బుకింగ్‌తో పాటు ఇతర అత్యవసర సేవల లావాదేవీలపై ఈ నిబంధన ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో అక్టోబర్ 15, 2026 నుంచి కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించాలని నిర్ణయించారు. అయితే, రైల్వే టికెట్ల బుకింగ్‌తో పాటు ఇతర అత్యవసర సేవల లావాదేవీలపై ఈ నిబంధన ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ రుసుమును కేవలం వ్యాపారులు, సర్వీస్ ప్రొవైడర్లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ప్రయాణికులు లేదా సాధారణ వినియోగదారుల ఖాతాల నుంచి అదనంగా ఒక్క రూపాయి కూడా కట్ కాదని అధికారులు స్పష్టం చేశారు.

**రైల్వే టికెట్ బుకింగ్స్.. మర్చంట్లకు మాత్రమే ఫ్లాట్ రూ.5 ఫీజు:**

సాధారణంగా వ్యాపార లావాదేవీలపై రూ.2,000 దాటితే 0.4 శాతం ఎండీఆర్ ఛార్జ్ అమలవుతుంది. కానీ ఇండియన్ రైల్వేస్ అత్యవసర సేవ కిందకు వస్తుండటంతో, ఎంత పెద్ద మొత్తంలో టికెట్ బుక్ చేసినా గరిష్టంగా రూ.5 ఫ్లాట్ ఫీజు మాత్రమే మర్చంట్‌పై పడుతుంది. ఉదాహరణకు రూ.10,000 విలువైన రైలు టికెట్ బుక్ చేసినా మర్చంట్ రూ.5 మాత్రమే చెల్లించాలి. అదే సాధారణ దుకాణంలో అయితే రూ.40 వరకు పడుతుంది. ఈ రాయితీ రుసుము నిర్మాణం రైల్వేలతో పాటు ఇంధన కొనుగోళ్లు, టెలికాం బిల్లులు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు, ఇతర అత్యవసర సేవలకు కూడా వర్తిస్తుంది.

**ప్రయాణికులకు ఉచిత సేవలు.. చిన్న లావాదేవీలపై సున్నా ఛార్జీలు:**

రైల్వే నెట్‌వర్క్ వ్యాప్తంగా రోజువారీ వేలాది లావాదేవీలు జరుగుతుండటంతో వచ్చే ఈ ఫీజు భారాన్ని ఇండియన్ రైల్వేస్, ఐఆర్‌సీటీసీ, భాగస్వామ్య బ్యాంకులు కలసి పంచుకుంటాయి. చట్టబద్ధంగా ఈ వ్యయాన్ని ప్రయాణికులకు బదిలీ చేసే అవకాశం లేదు. మరోవైపు రూ.2,000 లోపు ఉండే చిన్న తరహా రోజువారీ యూపీఐ లావాదేవీలు గతంలో మాదిరిగానే పూర్తి ఉచితంగా కొనసాగుతాయి. కాబట్టి సాధారణ ప్రజలపై ఎటువంటి అదనపు ఆర్థిక భారం పడకుండా డిజిటల్ చెల్లింపులు వేగవంతంగా సాగనున్నాయి.



# ఆదివారం బ్యాంకులు .. కేంద్రం, ఆర్‌బీఐ కీలక నిర్ణయం

హైదరాబాద్ : బ్యాంకింగ్ సేవలకు వరుసగా ఐదు రోజుల పాటు అంతరాయం ఏర్పడే పరిస్థితి నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకున్నాయి. సాధారణంగా సెలవు దినమైన ఈ నెల 27వ తేదీ ఆదివారం కూడా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్‌ఆర్‌బీలు) ఆదివారం సాధారణ పని వేళల్లో పనిచేయనున్నాయి. ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా, ముఖ్యంగా అత్యవసర బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. బ్యాంకింగ్ యూనియన్లు వివిధ డిమాండ్లపై ఈ నెల 28వ తేదీ నుంచి వరుసగా మూడు రోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చాయి. వారంలో ఐదు రోజుల పనిదినాల అమలు, పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ విధానం వంటి అంశాలపై బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం, మంగళవారం, బుధవారం మూడు రోజుల పాటు బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. దీనికి ముందు నాలుగో శనివారం కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవు ఉంటుంది. ఆ తర్వాత ఆదివారం కూడా సాధారణ సెలవు దినమే. దీంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖల్లో ప్రత్యక్ష సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉండటంతో కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ ఈ చర్యలు చేపట్టాయి. సమ్మె కారణంగా సాధారణ ప్రజలు, వ్యాపారులు ఎదుర్కొనే ఇబ్బందులను కొంతవరకు తగ్గించేందుకు ఈ నెల 27వ తేదీ ఆదివారం బ్యాంకు శాఖలను తెరిచి ఉంచాలని కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. ఇందుకు ఆర్‌బీఐ కూడా అనుమతి ఇచ్చింది. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు కూడా ఆదివారం సాధారణ పని వేళల్లో కార్యకలాపాలు నిర్వహించనున్నాయి.






# రజనీకాంత్ కోసం వెనక్కి తగ్గిన ధనుష్..
# 'ఓం' విడుదల వాయిదా!

**సూపర్ స్టార్‌పై అపారమైన ర**
**గౌరవంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి**

**దీపావళికి సూర్య సినిమాతోనూ**
**పోటీ పడబోమని స్పష్టీకరణ**

**సినిమా పరిశ్రమ శ్రేయస్సు కోసమే**
**ఈ నిర్ణయమని పేర్కొన్న నటుడు**

**'ఓం' కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని వెల్లడి**

ప్రముఖ నటుడు ధనుష్ తన తదుపరి చిత్రం 'ఓం' విడుదలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాతో పోటీని నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులతో ఈ విషయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ధనుష్ ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. "ఇలాంటి సమయాల్లో ఒక సినిమా విడుదలను మార్చడం ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. మేమంతా ఎంతో ఆరాధించే, గౌరవించే సూపర్‌స్టార్ రజనీకాంత్ గారి సినిమా 'జైలర్ 2' అక్టోబర్ 15న వస్తోంది. మా సినిమా దాని తర్వాత రోజే (అక్టోబర్ 16) విడుదల కావాల్సి ఉంది. ఆయనపై ఉన్న అపారమైన గౌరవంతో మా 'ఓం' సినిమా విడుదలను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. అంతేకాకుండా, దీపావళికి కూడా తమ సినిమా రావడం లేదని ధనుష్ స్పష్టం చేశారు. "ఈ ఏడాది దీపావళికి కూడా మేము రావడం లేదు. ఎందుకంటే ఆ తేదీకి సూర్య గారి సినిమా ఇప్పటికే ఖరారైంది. నిజానికి వాళ్లే ముందుగా తమ విడుదల తేదీని ప్రకటించారు. పెద్ద సినిమాల మధ్య పరస్పర అవగాహన, గౌరవం ఉండాలని, సినీ పరిశ్రమ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవించాలని నేను బలంగా నమ్ముతాను. మా సినిమా కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం" అని తన పోస్టులో వివరించారు. సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యను ధనుష్ గతంలో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. 2004లో వీరు వివాహం చేసుకోగా, 2022లో విడిపోయారు. ఈ నేపథ్యంలో, ఆయన తీసుకున్న ఈ నిర్ణయం కేవలం వృత్తిపరంగానే కాకుండా, వ్యక్తిగతంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక 'జైలర్ 2' విషయానికొస్తే, ఇది 2024లో ఘన విజయం సాధించిన 'జైలర్' సినిమాకు సీక్వెల్‌గా రాబోతోంది.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది!: శివాజీ

**'మంగళం శ్రీను' పాత్ర తనకే రావాల్సి ఉందన్న శివాజీ**

**ఆ పాత్ర సునీల్ కే రాసిపెట్టి ఉందని వ్యాఖ్య**

**'కూర్మావతారం' అనే చిత్రంలో కూడా తాను నటిస్తున్నట్టు వెల్లడి**



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ -- సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు. 'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

# నన్ను దొంగను చేశారు
# సోదరి రాధపై నటి అంబిక ఫైర్



ఒకప్పటి ప్రముఖ నటీమణులు, అక్కచెల్లెళ్లు అయిన అంబిక, రాధల మధ్య ఆస్తి వివాదం ముదిరింది. తనపై సోదరి రాధ చేసిన ఆరోపణలను అంబిక తీవ్రంగా ఖండించారు. తనను దొంగగా చిత్రీకరించడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవహారాన్ని పోలీసుల వరకు తీసుకెళ్లడం తనను మానసిక వేదనకు గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. దాదాపు రూ. 46 కోట్ల విలువైన చెక్కులను తాను, తన సోదరుడు మల్లికార్జున్ కాజేయాలని చూశామంటూ రాధ చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంపై అంబిక స్పందించారు. ఈ ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని, తాను ఎటువంటి తప్పు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. చిన్నతనం నుంచి కుటుంబం కోసం అహర్నిశలు శ్రమించానని, అటువంటి తనపై రాధ గదిలో నుంచి చెక్కులు దొంగిలించానని నిందలు వేయడం బాధాకరమని అన్నారు. రాధ తన వస్తువుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటుందని, నంబర్ లాక్ ఉన్న బ్యాగులనే వాడుతుందని, అటువంటప్పుడు దొంగతనం జరగడం అసాధ్యమని అంబిక వెల్లడించారు. ఈ వివాదానికి మూలకారణం ఆస్తి గొడవలేనని అంబిక తెలిపారు. 'ఏఆర్ఎస్ గార్డెన్'ను తాను ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిర్మించానని, దివంగత ఎంజీఆర్ ఆశీస్సులతో ఆ పేరు పెట్టానని ఆమె గుర్తుచేశారు. అయితే, ఆ పేరును 'ఆర్.ఆర్. గార్డెన్'గా మార్చి, తనకు రావాల్సిన వాటాను నిరాకరించడంతోనే న్యాయపోరాటం చేయాల్సి వచ్చిందని ఆమె వివరించారు. ఈ సమస్యను కుటుంబ సభ్యుల మధ్యే పరిష్కరించుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినప్పటికీ, అవి ఫలించలేదని అంబిక పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున, న్యాయవ్యవస్థపై గౌరవంతో ఈ అంశంపై ఇకపై బహిరంగంగా మాట్లాడబోనని ఆమె స్పష్టం చేశారు.




CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY,
BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY, # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printed at: GARUDA PRINT-ERS, # H.No.2-86/1, Plot No.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510. Telangana. Published at: # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District. 501511. Telangana....www.arunaprabha.com.email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889.